# కవితా కౌముది - 2013



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 101

# కవితా కౌముది

*ఈ కవితలు 2013 కౌముది సంచికలలో ప్రచురించబడ్డాయి*

## సూచిక (Index)


| ఏడాది | నెల | కవిత | రచన | పేజి |
|---|---|---|---|---|
| 2001 | 01 | వెన్నెల సంతకం | మధు పెమ్మ రాజు | 5 |
| | | జీవితమా | మాధవ తురుమెళ్ళ | 6 |
| | | నిన్న నేడు రేపు | అకుండి శైలజ | 6 |
| | | అవ్యక్తమూర్తి | సన్యాసి | 7 |
| | | ఒంటరులము కాలేము | కర్ల పాలెం హనుమంత రావు | 8 |
| | | సంక్రాంతి కాంత | ఉమా భారతి కోసూరి | 9 |
| | | నాలుగు కాళ్ళ గది | డా కె గీత | 10 |
| | | వద్దే వద్దు | డా నారాయణ గరిమెళ్ళ | 11 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 12 |
| 2013 | 2 | మగవాడు మూగవాడు అవ్వుతున్నడూ | వీరేశ్వర రావు ఎమ్ | 13 |
| | | చెట్టూ – మనిషి | యామిజాల జగదీష్ | 14 |

| | | | | |
|---|---|---|---|---|
| | | ఒంటరితనం? | జ్యోత్స్న తీర్థాల | 14 |
| | | మృత్యోర్మా: అమృతం గమయా!! | మణి మూర్తి వడ్లమాని | 15 |
| | | ఓ మనసా | రాళ్లబండి శశి శ్రీ | 16 |
| | | బ్రతుకు పోరాటం | పి వాణి | 17 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 18 |
| 2013 | 3 | మాయ కావాలి | భద్రి రాజు శ్రీనివాస్ | 19 |
| | | సుఖ దుఃఖాలు | ద్రోణంరాజు శ్రీ వెంకటేశ్వర్లు | 20 |
| | | దీప వనిత | చావలి విజయ | 20 |
| | | కసుగాయగా రాలకు | కర్లపాలెం హనుమంత రావు | 21 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 22 |
| 2013 | 04 | మరణం ఓ కామా | లిపి మల్లాది | 23 |
| | | జీవితం | ద్రోణం రాజు శ్రీ వెంకటేశ్వర్లు | 24 |
| | | అవ్యక్తం | డా.జయంతి రమేష్ | 24 |
| | | ఆలోచనా లోచనాలు | యామిజాల జగదీష్ | 25 |
| | | సమిధ | మల్లాది శ్రీ | 25 |
| | | వేసవి వచ్చేసింది | ఆకుండి శైలజ | 26 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 27 |
| 2013 | 5 | సుతి మెత్తని ఉదయం | నాగరాజు రామస్వామి | 28 |
| | | తస్మాత్ జాగ్రత్త | రావెల పురుషోత్తమరావు | 29 |
| | | అంతర్ముఖం: | వీరేశ్వర రావు ఏమ్ | 30 |
| | | ఎలా మరువడం | జాన్ హైడ్ కనుమూరి | 30 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 31 |
| 2013 | 6 | మాటల తూటాలు | రాళ్ల బండి శశి శ్రీ | 32 |
| | | పాఠశాలల జైళ్ళు | జ్వలిత | 33 |
| | | అక్షరం బాధ | అమూల్య తెర్లి | 34 |

| | | | | |
|---|---|---|---|---|
| | | చేజారిన పుస్తకం | డా నీరజ అమరవాది | 34 |
| | | నిష్క్రమణ | నాదెళ్ళ అనురాధ | 35 |
| | | అక్షరాశ్రువులేరుకుంటూ.. | చల్లా రామఫణి | 36 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 38 |
| 2013 | 7 | కవితెవరిది? | విజయభాస్కర్ | 39 |
| | | అతని నవ్వు | నాదెళ్ళ అనురాధ | 40 |
| | | సజీవ చిత్రం | మధు పెమ్మ రాజు | 41 |
| | | బుద్ధ దేవుని భూమిలో.. | సారధి మోట మర్రి | 41 |
| | | తలపోతలు | నాగరాజు రామస్వామి | 42 |
| | | కాఫీ దండకం | జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు | 43 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 45 |
| 2013 | 8 | ఉత్కృష్ట  కవన మార్గం | ఎలనాగ | 46 |
| | | మట్టి వాసన | తమిరిశ జానకి | 47 |
| | | సెలవిస్తారా? | శ్రీ అరుణం | 48 |
| | | శంఖువు | వాణి చిలకలపూడి | 49 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 50 |
| 2013 | 9 | ఖాళీ ఉత్తరం | నిషిగంధ | 51 |
| | | వెన్నెల సంతకం | క్రాంతికుమార్ మలినేని | 52 |
| | | నిజంగా..? | వెంకట్ | 53 |
| | | మనసే రధసారధి | రాధిక బుక్కా | 54 |
| | | నిశ్శబ్ద  రాగం | డా నీరజ అమరవాది | 55 |
| | | నువ్వు నేను | జ్యోత్స్న తీర్థాల | 55 |
| | | భావ వీచికలు | వీరేశ్వర రావు ఎమ్ | 56 |
| | | మన పద్యం మంచి ముత్యం | ఎన్ వి ఎన్ చారి | 57 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 58 |

| | | | | |
|---|---|---|---|---|
| 2013 | 10 | కలల మొలకలు | నాదెళ్ళ అనూరాధ | 59 |
| | | అదే నిద్ర, అవే కలలు | వెంకట్ | 60 |
| | | మనసు రాత | క్రాంతికుమార్ మలినేని | 61 |
| | | నా లేఖిని | శ్రీ స్వర్ణ | 62 |
| | | ఆశ నిరాశ | విజయకుమార్ ఎస్వి కే | 63 |
| | | టైమ్స్ స్క్వేర్ | యు.ఎ.ఎన్.మూర్తి | 64 |
| | | యవ్వనోధతి – ఒక జవనాశ్వహేల | నాగరాజు రామస్వామి | 65 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 66 |
| 2013 | 11 | బియ్యం గింజలు | డా రావి రంగారావు | 67 |
| | | తరగని సరాగాల గని | ఎలనాగ | 68 |
| | | నేనే నువ్వు | పంజా | 69 |
| | | ఒక పాట | మోహన్ రావిపాటి | 70 |
| | | బేదానా | ఎస్ హరగోపాల్ | 71 |
| | | అంతర్మధనం | పి వాణి | 72 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 73 |
| 2013 | 12 | తెల్లని కాగితాలు | ప్రతాప్ | 74 |
| | | గమ్యం | క్రాంతికుమార్ మలినేని | 75 |
| | | భావ వీచికలు | ఎస్.కె.వి.రమేష్ | 76 |
| | | బడుగుజీవి | వాణి చిలకలపూడి | 77 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 78 |

# వెన్నెల సంతకం

మధు పెమ్మరాజు

ఏకాంతంలో సందోహన్ని నింపి
గుంపులో ఏకాకిని చేసే
జ్ఞాపకాల దారే వేరు
తీపి బాధల తీరే వేరు!!

పిండారబోసిన వెన్నెల్లో
లైబ్రరీ మెట్లపై
నువ్వు నేను అబద్ధపు నిశ్శబ్దం
ఏళ్ళుగా తిరిగిన చోటైనా
గాలి తెరల కొత్త అర్థాలు
చిరు చినుకుల పలకరింపులు
తీరం చేరిన పరిచయాలకి
లయగా, సాక్ష్యంగా కదలాడే ప్రకృతి
వెండి వాకిట, నిండు సందడి ఆ రాత్రి!

నీ ఆలోచనలు అత్తరు జల్లితే
చిరునవ్వులు సద్దు చేస్తే
కలత నిద్రల, పలవరింతల రాత్రులెన్నో
కలలోని సామీప్యం

వరమై, నిజమై అరుదైన ఆ క్షణం
వెన్నెల చల్లదనమో
గుబులు నింపిన వెచ్చందనమో
తెలిసీ తెలియని అసహాయత!
వెల్లువలా పొంగే భావాలు
ఆనవాళ్ళు లేని లోయల్లో
దారి తప్పినా, జారిపడినా
మలుపు చూసినా సమ్మతమే
మైకమో, పాశమో, ప్రణయమో
ఏ పేరు పెట్టినా,
ఎలా పిలిచినా పరవశమే
వెను తిరిగే ధ్యాస లేదు
రేపటి భ్రాంతి లేదు
ఆ క్షణం అలా మిగిలితే చాలు
వెన్నెల సంతకం
తీపి జ్ఞాపకం అయితే చాలు !!

★★★



# జీవితమా

మాధవ తురుమెళ్ళ

**ప్రతిమనిషినీ** ఆశ్రయించుకుని,
రామునికి సీతలాగా అరణ్యవాసంలో చిక్కిపోయో -
నలునికి దమయంతిలాగా దుర్భరదారిద్ర్యంలో సడలిపోయో -
ధర్మరాజుకు ద్రౌపదిలాగా జ్యూతంలో ఓడిపోయో -
గౌతమునికి అహల్యలాగా రాతిగామారిపోయో,
సంప్రదాయాన్నొదలక
పత్నీవ్రతం పాటించే జీవితమా
నీ వెప్పుడూ-
నన్ను ఆశ్చర్యపరుస్తూనే ఉంటావు
చీకటివెలుగుల మధ్య
సంధ్యాకాలపు ఎర్రరంగుల్లో
దోబూచులాడుటుంటావు...

నిన్నుపొందిన ఒకడు
ఆనందంగా బ్రతుకు సాగించే ఉత్సాహంలో -
గొంతులో అమృతమని భ్రమపడి షాంపేను పోసుకుంటూంటే,
నీచే తిరస్కరించబడ్డ వేరొకడు
విషాదంగా బ్రతుకు తలుపుకు
ఆఖరుమాటు గొళ్లెం పెడదామన్నట్లు
గొంతులో విషం పోసుకుంటున్నాడు...
నీవు అనుగ్రహించిన ఒకడు
నిశిరాత్రి అనేక హంసతూలికా తల్పాలున్న భవంతిలో
ఏ మంచంపై పడుకుందామా
అని ఆలోచిస్తుంటే -
నీవు ఆగ్రహించిన వేరొకడు
చలిలో వణుకుతూ స్మశానంలో
కాలుతున్న ఏ చితిపక్కన నిద్రిద్దామా
అని మధనపడుతున్నాడు.!

నీవు పెట్టగా తిన్నది అరగక ఒకడు బాధపడుతూంటే
నీ తిరస్కారానికి లోనైన వేరొకడు తినడానికి
ఏం దొరుకుతుందా అని ఆరాటపడుతున్నాడు..

జీవితమా  నీ వెప్పుడూ-
నన్ను ఆశ్చర్యపరుస్తూనే ఉంటావు
చీకటివెలుగుల మధ్య
సంధ్యాకాలపు ఎర్రరంగుల్లో
అర్థమవకుండా దోబూచులాడుతుంటావు...

★★★

# నిన్న నేడు రేపు

ఆకుండి శైలజ

**నిదురించిన** నిన్నని పిలిచి
కదిలించకు నీ మదిని,
బెదిరించిన నేటిని తలచి
నిదురించకు మారదని,
ఉదయించే రేపును వలచి
మొదలెట్టిన వాడే మనిషి,
శ్రమజీవికి ఓటమి రాదు
శ్రమ శక్తికి పోటీ లేదు!
వెనుతిరగక వేసెయ్ అడుగు
వెన్నెల రాకుంటే అడుగు!!

★★★

# అవ్యక్తమూర్తి

సన్యాసి

**ఎవని చేదోయి నించి** ఈ మహా సుందర జలపాతాలు
శైల శిఖరాగ్రాలనించి క్రింద చరియలపై జాలువారె ?
ఎవని వూహలు ఈ సప్త ద్వీప వసుంధరని సృజియించె ?
ఎవని అనంత జ్ఞానశక్తి సర్వ మానవాళికి
బుద్ధి నొసగినీ జగతి నడిపె ?
ఎవడు తన అజ్ఞాత శక్తిచే ఈ భువన బ్రహ్మాండమెల్ల త్రిప్పు ?
ఎవని వెలుగుచేనీ తారకా చంద్ర సూర్య సహిత
సర్వగోళములన్ని వెలిగి పోవు ?
ఏమాయచే మనకు శీతోష్ణ సుఖదు:ఖాదులెల్ల
స్వానుభవైక వేద్యమాయె ?
ఏ ఐంద్రజాలికుడు సస్యశ్యామలంబైన
పంటపొలాల, వనాలనెల్ల సృజియించి ఇచ్చె ?

ఏ మాయావి తన హస్తమ్మునూచి
ప్రళయ ఝంఝామారుతమ్ము వీపె మనపై ?
ఎవని కృపచే ఉదయాస్తమాలలో
పూలవాసనలతో చల్లని పిల్ల వాయువులు వీచె ?
ఎవడు చిన్నారి పాపల బోసి నవ్వుల కారణంబు ?
వాడె వృద్ధుల పండు నొసబొమల వెనక దాగియున్న
ఆర్ధ్రతా పూరిత మమతల వృద్ధి జేయు.
ఎవడు సర్వ కర్మ కర్తృత్వముల కధినేత ?
వాడె సర్వఫలభోక్తృత్వముల దాత
ఎవడు పంచకోశాత్మక మానవాళిని సృజియంచి
తోడుగా పాంచభౌతిక బ్రహ్మాండంబు కానుకగ నొసంగె ?
ఎవడనామయుండు వాగామగోచరుండు ?
ఎవడు సర్వజ్ఞండు సర్వశక్తి సమన్వితుండు ?
సర్వేశ్వర నియుక్తుండు ? సర్వమును శాసించువాడు ?
నామరూపరహితమా మహా చైతన్య శక్తి
జీవ జగదీశ్వర త్రిపుటిగా భాసించు మూర్తి.
జనన,జీవన. మరణాల మూల కారణమ్ము తానె
వానినొక విగ్రహమ్ముగా మలిచి పూజింపజాల
పేరు, ఊరు లేనివాని పేరు పెట్టి పిలువజాల
వాని నశరీరు, గుడికట్టి బంధింపజాల
నేనె నా శరీర దేవళమ్ము వీడి,
ఆ అవ్యక్తమూర్తిలో కలిసిపోదు కలిసి
ఈ సుందర ప్రకృతినెల్ల తానుగా తలపోసి
తిలకించి తరియింతు నెపుడు.

★★★



# ఒంటరులం కాలేం- కర్లపాలెం హనుమంతరావు

1

**అనుకుంటాం** కానీ ఎవరమూ

ఎప్పటికీ  ఒంటరులం కాము

2

పూల మీద నడుస్తున్నా

పాదం కందకుండా కింద

అమ్మ అరచేయి అడ్డు పెడుతుంది

3

ఉట్టికెగిరేటప్పుడు

రెక్క తెగి- నువు పడకుండా

నాన్న నీడ పహారాగా నిలబడుంటుంది

4

తోబుట్టువులు

తోటి చేపలతో

బతుకు తొట్టె

ఈత కొలనుగా ఎప్పుడూ సందడే!

5

నీ రాలి పడే నవ్వులకు

ఒడి పట్టి వెంటబడే లోకమో!

6

కన్నీరైనా  ఒంటరిగా వదలుతుందా!

చెక్కిలి తడి కాకుండా

చెలిమి హస్తం ఉండనే ఉంది

7

చీకటి చింతలో

అర్థభాగం

అద్దంముక్కలా

పక్కలోనే పక్కన

8

అమావాస్య నాటి

వెన్నెల ఊహలా

పిల్లల గోల

9

చావుతో అంతా ఐపోయిందనుకోడం

శుభం కార్డు పడితే

మరో ఆట లేదనుకోడం

10

అనుకుంటాం కానీ ఎవరమూ

ఎప్పటికీ  ఒంటరులం కాము

కాలేం

★★★

# సంక్రాంతి కాంత

ఉమాభారతి కోసూరి

సంపదలు అందించి
ఆనందాలు పండించ
బంతిపూల నవ్వులతో
ఏతెంచె సంక్రాంతి కాంత

మంచుపూల పల్లకి మీద
వెలుగులు విరజిమ్ముతూ
పుడమిని నిదుర లేపింది
అన్నులమిన్న సంక్రాంతి కాంత

ఆమె నడయాడే దారి పొడవునా
అమె కదలాడే వాడ వాడలా
అంబరమంటె సంబరాలు
పల్లె పండుగ సరాగాలు

వేకువ జాము వెలుగుల్లో
ముత్యాల ముగ్గులు వేసింది
గొబ్బెమ్మల వరుసలు పేర్చింది
చిన్నారులతో ఆడిపాడింది

పసుపు కుంకుమల తోడ
ముత్తైదువులతో చేరి
అల్లుళ్ళ ఆగమనాలకి
ఆహ్వానాలు పలికింది

గొబ్బిళ్ళ పై పూలుంచి
గౌరమ్మని సేవించి
వేడుకొనే కన్నెలను
మనసారా దీవించింది

నగవులతో కుశలమడిగి
చూపులతో సేదతీర్చి
సౌభాగ్యాల వరాలిచ్చి
సాగిపోయింది సంక్రాంతి కాంత

★★★



# నాలుగు కాళ్ల గది

డా|| కె.గీత

**నడిచే నాలుగు** కాళ్ల గది నా చుట్టూ-
రాళ్లు మింగే సంధ్య సూర్యుణ్ణీ
చుక్క మీద పడని వెల్లువ వాననీ
వెనక్కి పారిపోయే చెట్ల వరుసల్నీ మార్చి మార్చి ప్రదర్శించేది
మండు వేసవి లోనూ చల్లని తెమ్మెరై చుట్టుకునేది
వణికించే చలిని దరిచేరనివ్వకుండా వెచ్చని కౌగిట్లో దాచుకునేది
ఈ గదిలో ఎన్నెన్ని జ్ఞాపకాలు!!
కేరింతలు, నవ్వులు, దు:ఖాలు, కోపతాపాలు....
కాలికింద ఎంత తుడిచినా పోని ధూళి కణాల్లా-
రివ్వు రివ్వున ఊర్లు చుట్టీ-
వాగులు దాటీ-
కొండలు కోనలు పయనించి
బహుదూరం- ఇట్టే దగ్గర చేసే
నా నాలుగు కాళ్ల గది చక్రం ముందు కూర్చుంటే
ప్రపంచాన్ని నడిపే చుక్కాని చేతికందిన గర్వాతిశయం
పసిపాపని హత్తుకున్నట్లు ప్రేమానురాగం
రోడ్డు మీద పరుగెత్తే రెక్కల్లేని తూనీగ-
ఎందరినైనా సునాయాసంగా మోసుకెళ్లే బంపర్ ఫైబర్ రథం
చిన్న గీత పడినా మనసు మీద పెద్ద మచ్చే-
కాస్త బురదంటినా స్నానించాలని శ్రద్ధే-
మనసు గోడల్ని తడిమి మురిపెంగా చూసుకున్న నా గది
రేపెవరిదో!?
కారు అమ్మాలంటే జ్ఞాపకాల్ని అమ్ముతున్న బాధ-
నడిచే నాలుగు కాళ్లతో ముడి పడి ఉన్న అన్ని బంధాల్ని వేలం
వేస్తున్న దు:ఖం-
రూల్సు, ఫైన్ ల చిరు ముల్లులు
పెట్రోలు, సర్వీసింగుల వేల వడ్డింపులు లేవిక
విసుగెత్తే ట్రాఫిక్ జాం, సెకండ్ గేర్లు లేవిక
అయినా పాపం- యంత్రం కదా-
మనసు లేని మనిషికైనా దాస్యం చేస్తుంది
నన్ను వదిలిపెట్టొద్దని ప్రాధేయ పడలేదు-
ఢీ కొట్టినా, చటుక్కున అమ్మి పారేసినా కిక్కురు మనదు-
గాయ పడదు- గాయ పర్చదు-
ఎటు తిప్పితే అటు తిరిగే వట్టి యంత్రం కదా!
నేను గదిని దూరం చేసుకున్నా
బరువుగా నా గుండెలో పరుగులెడుతూనే వుందెందుకో
ఇప్పుడు నాలుగు కాళ్ల గది నా లోనే వుంది

★★★

**వీక్షణం నాల్గవ సమావేశంలో చదివిన కవిత**



# వద్దే వద్దు

డా. నారాయణ గరిమెళ్ళ

**కొని మరీ తెచ్చాక**
ఏ మారుమూలో
అణకువగా పడి ఉంటుందంటే
ఎవరు మాత్రం దానిని నమ్మేది?

బుసలు కొట్టి కాటేశే బుల్లెట్లని
లోలోపలె లోడు చేసి పెట్టేసుకుని,
అటెన్షన్ లో ఉండాలని ఉవ్విళ్ళూరే,
తన ఉనికిని పదేపదే బయటపెట్టుకోవాలని తపించే
దానిని
'అహింసా మూర్తనో,
కారుణ్య మాతనో' కీర్తిస్తూ దండకాలు చదివితే మాత్రం
ఎవరు నమ్ముతారు?

తుపాకీ ఎప్పుడూ తుపాకీయే....
తుత్తునియలు చేయాలనే అనుకుంటుంది
ఛిద్రాన్నీ, విచ్ఛిన్నాన్నీ సాకారం చేసుకుని
స్మశానాలకు కొత్త బాటలు వెయ్యాలనే అనుకుంటుంది

ప్రతి సమస్యకు పరిష్కారాన్ని ,
పేలడంలోనే కనుగోవాలనుకుంటుంది
ప్రతీ పైత్యపు మనోవికారాన్ని,
బుల్లెట్లు కురిపించి మాత్రమే తీర్చుకోవాలనుకుంటుంది.

శతాబ్దాలుగా,
పేలిన ప్రతి సారీ
పొట్టన పెట్టుకుంటూనే ఉంది.

తరగతి గదుల్లోనైనా
సినిమా-హాలు లోనైనా
పదిమందీ గుమిగూడే ప్రాంగణమేదైనా
దాని కంటికి ఆకలి తీర్చుకునే వేదికలాగే కనిపిస్తుంది
ఎప్పుడైనా ఎక్కడైనా.....
తుపాకీ తనను తానొక సాధుజంతువని ఎప్పుడూ
నిరూపించుకోలేదు.
కొన్నందుకు ఉన్నందుకూ ......
నిర్లక్ష్యంగా, కిరాతకంగా కసితీరా పేలింది.
చనిపోయిన ఇళ్ళల్లో
ఒక క్రిస్మస్ కే
అనేక క్రిస్మస్ ల పాటు కోలుకోలేని విషాదాలను
బహుమతులుగా ఇచ్చింది.

ఆ తుపాకీ వద్దు
మదిలో, గదిలో, మార్కెట్లలో ఎక్కడా కూడా....
ప్రాణం మనగలగాలనుకునేంత కాలం
తుపాకీ వద్దు....వద్దే వద్దు.

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నేల స్తంభించె హేమంత కాలమందు
చలికి గడ్డ కట్టెను జంతుజాలమెల్ల
స్థాణువైపోయె మనల చైతన్యమెల్ల
ఎదురు చూతుము వెచ్చని ఋతువు కొరకు

హిమము రాశులు రాశులై యిలను నిండె
శీతలమ్మయ్యెనెల్లెడ చెట్టు చేమ
శీతలమ్మయ్యెనెల్లరి చిత్తములును
ఎదురు చూతుము వెచ్చని ఋతువు కొరకు

చల్లదనమది కదలి యెచ్చటికొ చనును
కరిగి హిమరాశులెచటికో తరలిపోవు
అలరు బాలలు మేల్కొని యావులించు
కనులు తెరచి తుమ్మెదలు రెక్కలు విదల్చు

కదలిపోవునెటకొ చలికాలమెపుడు
వచ్చు వెన్నంటి వెచ్చని వాయువెపుడు
మనసు నిస్తేజమౌ రోజు మరలిపోవు
ఎదురు చూచిన రోజు తానెదురు వచ్చు

కష్టములు కలతలు సాగు గతము వైపు
సుఖము సంతోషములకిల చోటొసంగు
రాత్రి యెల్లను చీకటి రాజ్యమేలు
వేవెలుంగులు కన్పట్టు వేకువందు

# మగవాడు మూగవాడవుతున్నాడు

వీరేశ్వరరావు ఎమ్



ఫేస్ బుక్ లో

పాత స్నేహాలు

పరిమళించినప్పుడు

మగవాడు మూగవాడవుతున్నాడు!

పేగుబంధం

పోగుబంధంల

ఆధిపత్యపు పోరులో

తనదెపుడూ 'సాక్షి' పాత్రయినపుడు

మగవాడు మూగవాడవుతున్నాడు!

మగతనమని మురిసిపోయినా

నిత్యం బానిసత్వపు అడుగుజాడలలో

పయనమయినప్పుడు

మగవాడు మూగవాడవుతున్నాడు!

పుట్టిన బంధాలన్నీ

చిత్తాన్నీ, విత్తాన్నీ ఛిద్రం చేసినప్పుడు

మగవాడు మూగవాడవుతున్నాడు!

పెరిగిన బంధాలు

పశ్చిమంలో స్థిరపడినపుడు

వార్థక్యం వృద్ధాశ్రమంలో బీటలు తీసినప్పుడు

మగవాడు మౌనంగా

ఘనీభవిస్తున్నాడు!!

***



# చెట్టూ - మనిషి

యామిజాల జగదీష్

చెట్టు మనిషిని బుద్ధుడ్ని చేసింది
మనిషి చెట్టుని రక్తంగా మార్చాడు
శిలువైన తర్వాతసైతం
ఓ చెట్టు జీసస్ ని మోసింది
మనిషేమో కూలుతున్న చెట్టు బాధనూ ఆలోచించడు!

చెట్టు కూలిపోతున్నప్పుడు
దాని గాయాలు ఆకాశంలో నమోదవుతున్నాయి
కొన్ని మేఘాలు కన్పించకుండా పోతున్నాయి

ఒక చెట్టు నీడలో ఎందరో సేదదీరుతారు
మనిషి నీడలో కనీసం ఆ మనిషి కూడా సేదతీరలేడు

చెట్లు నీ శ్వాసను శుభ్రం చేస్తాయి
మనిషేమో చెట్ల గాలిని కాలుష్యం చేస్తున్నాడు

జంతువుల స్థావరంలో
చెట్లు భయపడకుండా ఎదుగుతాయి
మనుషుల అడవుల్లోనే
చెట్లు భయంభయంగా పెరుగుతాయి

మనిషీ
ఎప్పుడైనా ఆలోచించావా?
కొమ్మలు చాచి చెట్టు నిన్ను ప్రేమతో పిలిచినప్పుడు
నీ కన్నతల్లిని అనుకున్నావా?

చల్లగాలిని వీచే చెట్టు స్పృశించినప్పుడు
నీ భార్యను అనుకున్నావా?
పువ్వులను రాల్చిన చెట్టు నిన్ను ఆనందపరచినప్పుడు
నీ పిల్లలను అనుకున్నావా?

ఇప్పుడు చెప్పు -
నీ తల్లినీ , నీ భార్యనూ , నీ పిల్లల్నీ
ఒకే సమయంలో
నువ్వు హత్య చేయగలవా? ***

# ఒంటరితనం?

జ్యోత్స్న తీర్థాల

నా ఆలోచనలు నా ఆవేశాలు
నా అనుభవాలు నా అనుభూతులు
గెలిపిస్తూ ఈ సారి, గేలిచేస్తూ ఓ సారి
నవ్విస్తూ ఓ సారి, నడిపిస్తూ ఓ సారి
ఓదారుస్తూ ఓ సారి, ఓడిస్తూ ఓ సారి
ప్రతిక్షణం నా నీడల్లే ఉన్నప్పుడు
ఇక నా జీవితంలో ఒంటరితనానికి చోటెక్కడ?

***

# మృత్యోర్మః అమృతం గమయా!! మణిమూర్తి వడ్లమాని

నాలో కి నేను తొంగిచూసాను!

అద్భుతం మహాద్భుతం!!

నాలో నేను ఎన్నడు చూడని ఒక మహాకాంతి

ఎంతో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తోంది!

నాలోవినిపిస్తోంది ఎన్నడూ వినని ఒక అపూర్వగానం

అది ఒక వింత అనుభవం!

నా దేహం దూదిపింజ కన్నా తేలికగా ఎగిరిపోతోంది

అనంత విశ్వంలోకి ఆకాశం లోని మేఘంలా!

నాలో ఏమిటి ఈ కొత్త ఉత్సాహం, ఏమిటి ఈ ఆనంద హేల!

ఎందుకు ఇంత పరవశం!?

కొండలు ,కోనలు, నదులు, సెలయేళ్ళు దాటి పైపైకి సాగిపోతున్నాను!

నా సుదీర్ఘ ప్రయాణం అలా అనంతంగా సాగుతూనే వుంది!

నాకు ఆకలి లేదు ,దప్పిక లేదు, అశాంతి లేదు,

దుఃఖం లేదు భాధ అంతకంటే లేదు!

ఎక్కడి దాక ఈ అంతు తెలియని అన్వేషణ,అంతటా శూన్యమే

ఆ శూన్యం లో నే నాకు ఏదో దివ్యానుభూతి కలుగుతోంది

సమస్త తిమిరాలును హరించే అఖండ జ్యోతి కనిపిస్తోంది

అంతటా ఆ జ్యోతి స్వరూపమే, తెల్లగా వెలుగులు చిందిస్తు

అంధకార బందురైమైన ఈ జీవాత్మకి వెలుగు నిచ్చే ఆ పరంజ్యోతి దగ్గరకి

క్రమ క్రమంగా ఆ మహా జ్యోతి లోకి

ఆ మహా వెలుగు వైపుకి అలా సాగిపోతున్నాను

"ఓం! అసతోమా సద్గమయా!

తమసోమ జ్యోతిర్గమయా!!

మృత్యోర్మ అమృతం గమయా!!!

***

# ఓ మనసా

రాళ్ళబండి శశిశ్రీ

ఎల్లలు లేని ప్రయాణం నీది
సాంఘిక హద్దుల్ని చెరిపేసి
సామాజిక గౌరవాన్ని పక్కన పెట్టి
నేను నీ వెంట రాలేను
ఆశల హరివిల్లుపై
ఊయల లూపుతావు,
ఆనందాల డోలికలలో
స్వర్గపుటంచులు చూపిస్తావు ,
నీ ఊహలకు పగ్గాలు వేయకపోతే
ఎంతదూరం పరుగులు పెడతావో !?
ఎక్కడ పడదోస్తావో !?
భావావేశాల గారడిలో
బాధ్యతలను మరిపిస్తావు,
కెరటంలా ఎగసి పడతావు
పాలపొంగులా చల్లారిపోతావు,
పరస్పర విరుద్ధ భావాలతో
సతమతం చేస్తావు,
అందుకే నీకు దూరం జరిగా !

కానీ ఇప్పుడే తెలుస్తోంది
భావావేశాలతో పాటు
అనుభూతుల్ని కూడా ఖైదుచేసి
నా ప్రపంచాన్ని చిన్నది చేశానని,
ఆస్వాదనల్ని ఆవిరి చేసి
కలల్ని నిద్ర పుచ్చానని ,
నువ్వు పంచే చిన్న చిన్న ఆనందాలకు
దూరం అయ్యానని !
నీతోడెంత విలువందో నువ్వు లేనపుడు
తెలిసింది!
ఈసారి దగ్గరైన నిన్ను మళ్ళీ
దూరంచేసుకోలేను!
మనసున్న మనిషిగానే కలకాలం
పయనిస్తాను!

***



# బ్రతుకు పోరాటం

పి.వాణి

ఎరుపెక్కిన కళ్ళు చీకటిని చీల్చుతుంటాయి
చీకటికి అలవాటు పడిన కళ్ళు
నీడల గుండెల్ని తడుముతూ ఉంటాయి
సాయపడే చేయి కనిపించదు
పోరాడే శక్తి అగుపించదు
క్షణ క్షణం సమస్యల సుడిగుండాలే!
ఎప్పుడు ఊడిపోతాయో తెలియని ఉద్యోగాలు
ఎన్ని పన్నులు మోస్తున్నామో తెలియనిఖర్చులు
పేదరికపు సర్వేలో మన వాటా ఎంత
ఆరోగ్యపు సర్వేలో మన భాగం ఎంత
నిరక్షరాస్యతా సర్వేలో మన శాతం ఎంత
ధనికులకి, మోసగాళ్ళకి, సుందరీమణులకి
అన్నింటికి కొలమానాలున్నాయి
కానీ,
సామాన్యమానవుడి జీవనప్రమాణాలకి కొలమానాలెక్కడ?

*****



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇరుల దాగిన పూవులనరయునెవరు?
అడవి సాగెడు సెలయేటినరయునెవరు?
మనసు లోతుల పాటల వినునదెవరు?
మనసు లోపలి కన్నీరు కనునదెవరు?

భూమి కంపించి సంద్రముల్ పొంగెనిపుడు
యుగయుగమ్ముల పర్వతమొరిగెనిపుడు
తలపులన్నియు తెగెను నా తలపునుండి
తలపె తలపులనెల్ల తా నులిమివైచె

ఎన్ని సుమములు విరిసెనో యిట! మరెన్ని
వలపులు విరిసెనో! ఎన్ని తలపులెడద
మాటున పవలు రేయియు మ్రగ్గెనో! గ
తించె కాలము స్పృహ గతియించిపోయె

ఇలయు నెలయును గలదాక నిలచునంచు
వేయి నోళ్ళను వచియింత్రు ప్రేమ గూర్చి
ఆదిమధ్యాంతములు లేనిదేది యంచు
సతము తలపోయుచుందు జీవితము గూర్చి

గతములోనికి జారిన గాథ నాది
కన్ను మరగెడు ధరపరాగమ్ము వోలె
నేలపైబడి వర్షపు నీట తడిసి
ఎండుటెదను తిరిగి జనియింపజేసె

*****

# మాయ కావాలి

## భద్రిరాజు శ్రీనివాస్

అక్కునచేర్చి లాలించే స్త్రీ మూర్తి ,

అమ్మ అనే భావంగా మిగిలే కల అన్న నిజం అడ్డాలనాడే తెలుస్తే?

చేయిపట్టి, అదుగులేయటం నేర్పించే మహోన్నత మూర్తి,

నాన్న అనే జ్ఞాపకంగా మిగిలిపోయే అనుభూతి అని

చిన్ననాడే తెలుస్తే?

వయసు వేడిలో, వలపు నీడలో ఉయ్యాలలూగే దంపతులకు

ముసురుకొచ్చే ముసలితనం వెక్కిరిస్తుందని ముందుగానే తెలుస్తే?

జ్ఞాపకం ఉన్నంతకాలమే జీవితం నిజం ,

జ్ఞాపకం నశించిన నాడు అంతా మాయయే ,

అంత మాయే ...అని ముందే తెలుస్తే?

ఈ నిజాలు తెలిసీ జీవితపు వేడుకల వుయ్యాలలూగుతున్నాము

ఎలా?

చీకటి చూసి భయపడే బిడ్డకు కథలు చెప్పి,

లాలించి భయం బాపె తల్లిలా,

తెలిసిన నిజాన్ని తెరమాటున దాచి మన్నిఓదార్చే చల్లని తల్లి;

మాయ.

ప్రసవ వేదనలో నరకాన్ని చూచిన స్త్రీ మూర్తి,

"నిజం" తెలిసీ ఆరు ఆరు బిలియన్ల బిడ్డలను కనగలిగే శక్తి నిచ్చేది

మాయ.

తండ్రి తలకు కొరివి పెట్టి ఇంటికివచ్చి ,

చూచిన "నిజాన్ని" అంతలోనే మరచి

ఆస్థి పంపకాల్లో కోర్టులక్కెక్కే లా చేయగల మాయలాడి మాయ.

" నిజం" , దాక్షిన్య రహితమయిన కాల స్వరూపం

మాయ ఆశ అనే బొమ్మనిచ్చి భయం బాపే నేస్తం

"నిజం", తట్టుకోలేని మహాగ్ని గుండమయితే ,

స్వాంతనము గూర్చే హిమ బిందువు మాయ.

మాయ లేని జీవితం అనస్తీషియా లేని సర్జరీ లాంటిది.

అందుకే ,.....**మాయ కావాలి.**

****



## సుఖదుఃఖాలు
## ద్రోణంరాజ శ్రీవేంకటేశ్వర్లు

అందమా! ఎన్నాళ్లుంటావు!

పరువమా! ఎందాకా వస్తావు?

అందచందాలతో

పుష్పించే పరువములో

ఆగుతుందా కాలం! ఉహూ!

పరుగెడుతుంది

మోహమా! వదలనిది

దాహమా! తీరనిది

కలలు కనే వయసు మరి!

కాలం కలసివచ్చి కలలు పండితే

అలాగే హాయిగా ఉండిపోతుంది ఆమని

సంతోషపు కాంతులలో

వెలిగే పోతుంది వృద్ధాప్యం

కలలు చెదిరితే

కారు మేఘాలు కమ్ముతు ఉంటే

ప్రకృతి విలయ తాండవము చేస్తూ ఉంటే

పొగిలి పొగిలి ఏడుస్తుంది జీవి!

సమయముతో సుదూరము వెళ్ళి

వెను తిరిగి చూస్తే!

జ్ఞాపకాలు! అనుభూతులు!

అనుభవించే సుఖ దుఃఖములు

స్వయంకృతమైన చేతల రాతలు కదా!

****

## దీపవనిత
## చావలి విజయ

చిక్కటి గాఢాంధకారంలో

మినుకు మినుకుమనే దీపం

కాంతి కలిగిస్తుంది

భ్రాంతి తొలిగిస్తుంది

చిక్కని వత్తితో , చక్కని భక్తితో

తేజస్సు రగిలిస్తుంది

తమస్సు కరిగిస్తుంది

మెరుపులా వెలుగులా మెరిసేటిది దీపం!

చక్కటి సంసార సాగరంలో

తళుకు తళుకు మనే స్త్రీ

మెప్పిస్తూ నప్పిస్తూ

కుటుంబ వ్యవస్థలో మురిసేటిది స్త్రీ!

అనుబంధాల ఆత్మీయతలకు

అనురాగాల సంబంధాలకు

తోడై నిలుస్తుంది నీడై కలుస్తుంది

సమాజ జీవనంలో సంపూర్ణ హోదాతో!

మగువ తోడుతో జీవనం

మనుగడలో నందనవనం

అహంకారం ఎగజిమ్మినపుడు

ఆత్మీయత అడుగంటినపుడు

చల్లని మాటలతో మెత్తని స్పర్శలతో

ఆశను రగిలిస్తుంది ధ్యాసను పెరిగిస్తుంది

దీపం వంటి స్త్రీ యింటికి దీపం!! ****

# కసుగాయగా రాలకు

కర్లపాలెం హనుమంతరావు

దీపంబుడ్డి లోపలి మసి

రాత్రి

ఇంటిని కాపలా కాసినందుకు

పగలు

తొడిగిన భుజనక్షత్రం.

బెరడుకు  గాయమయిందంటే

చెట్టు

చిన్నారి ఏ సృష్టికో

గోజుసాయం చేసినట్లు.

ఏ కాగితం

ఏ చిత్తుబుట్ట నుంచీ

బజారు కాలువలోకి పారుతుందో

ఏ రుబ్బురోట్లో చేరి

బుట్టబొమ్మ కంటిపాపై మెరుస్తుందో!

ఎవరికి తెలుసు!

మేడపైదాకా మెడ నిక్కించి

చందమామ అందాలని ప్రబంధం చేసే

కొబ్బరాకు

ఏ బుడ్డోడి నోట బూరాగా మారుతుందో

చీపురుకట్ట ఈనెలా మారి

దుమ్ముతో పోరుతుందో

ఎవరికీ తెలీదు.

రాణిగర్భంలో పడితే రాజయోగం

దోమగుడ్డులో చేరితే మురికికూపం

నలుసు చేతిలోలేని పరమరహస్యం అది.

చేతిలో  బతుకు  లేకపోతేనేమి

బతకడం మాత్రం  చేతిపనే!

రాజెవరో నందెవరో

చివరిదాకా తేలని ఆటలో

నీకు నువ్వే ఔటవడమేమిటి!

ఎన్నిమార్లోడి

ఎలబైట నిలబడ్డా

గెలుపు పిలుపు కోసం

ఎదురు చూడటమే బతుకు.

పంచభూతాలు ఎంత సారమిస్తే

అమ్మకడుపుకాయగా  సాకరమయ్యామో!

గెలమధ్యనుంచీ అర్థాంతరంగా తెగి

కన్న బొడె కడుపు కోయడం అన్యాయంరా నాయనా!

కారణం లేనిదే ఆకైనా పుట్టదంట

నిష్కారణంగా కసుగాయగానే రాలకు!

****

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నీదు జ్ఞాపకముల గూర్చి నిన్ను గూర్చి
వ్రాయబూనుదు పాటలు పద్యములును
అక్షరములన్ని తారుమారగుచునుండె
అర్థములు లేక పదములు వ్యర్థమయ్యె

పిచ్చి గీతలు వ్రాయుదు వేనవేలు
స్పష్టత నశియించిన మనోఫలకమిద్ది
తెగెను దారులన్నియు తీరుతెన్ను లేక
తిరిగి కలయును గమ్యమదృశ్యమగును

ఎపుడు నీ దారిలో పయనించుచుందు
ఎపుడు నా మార్గమున చరియించుచుందు
తెలియనేరని సందిగ్ధవలయమందు
అటునిటును వెడలక తిరుగాడుచుందు

ప్రాణమెల్లను ప్రేమకర్పణము చేసి
బ్రతుకదెల్లను నడిచి నీ పథమునందు
బరగుచుందును మధురానుభవమునందు
కనగనేరను నాదైన గమ్యమేదో

తెగిన దారులు సరిగ సంధిల్లునెపుడు?
త్యాగములు కాక కలుగునైక్యమ్మదెపుడు?
మార్గములు కాకనొక్కటే మార్గమెపుడు?
మనసులొకటియై ప్రేమను మరచుటెపుడు?

*****

# మరణం ఓ కామా

లిపి మల్లాది

నాకు శబ్దాలు వినిపిస్తున్నాయి
కాని మాట్లాడలేక పోతున్నాను,
మనుషుల తాకిడి  తెలుస్తోంది
కాని చూడలేకపోతున్నాను,
పెదాలు మూతపడ్డాయి
పళ్లు బిగుసుకు పోయాయి
ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి
కన్నీటి చుక్కలు స్పర్శిస్తున్నాయి

అగ్ని లో దహనమయ్యి
గంగ లో తడిసిపోయా
నీ లాలి పాటతో జో కొట్టవూ!?

ఏకాంతం నాకు ద్రోహం చేయదు
ఐనా ఈ గాయం మానదు
శోకం లో మునిగిపోయి శూన్యం లో కలిసిపోతున్నాను

కళ్ళు మూసుకుంటె కనిపించే చీకటిలో ఒక చుక్కగా మారి
ఉదయానే నిన్ను తాకే సూర్య రశ్మి గా మారి
నువ్వు ఆస్వాదించే పూల పరిమళాన్నై
నువ్వు నడిచే దారి పక్కన గడ్డి పూవునై
నీ కన్నుల తడి తుడిచే చిరునవ్వు నవుతా!
కరిగిపోయే కలలా కాక
నీ శ్వాసలో కలిసే గాలి తరగనై
నా అంత్యం తరువాత కూడా జీవిస్తాను ..!!!

****



# జీవితం

## ద్రోణంరాజ శ్రీవెంకటేశ్వర్లు

నా జీవితమొక తెల్ల తెల్లకాగితం

దానిపై ముత్యాల సరాలు

వ్రాయడము నాకు రాదు

మరకలు రంగులు నాకిష్టము లేదు !

మల్లె పూవు లోని తెల్లదనం - మనసునాహ్లాద పరచే వలపుధనం

నాకెంతో ఇష్టము

జీవితాంతము తెల్లకాగితం తెల్లగా ఉండిపోతే నాకు చాలు!

నేను రాయి రప్పగ ఉంటానని కాదు దాని అర్థం!

రాద్ధంతం లేకుండా చెబుతాను అంతరార్థం!

దూషణ, భూషణ, తిరస్కారములు

శరీరానికే గాని ఆత్మకంటవుగా!

కర్మ నాది కాకపోతే క్రియ ప్రక్రియ ఏమవుతాయి?

నా కాగితం తెల్లగానే ఉండిపోతుంది !!

తీరమెక్కడో తెలియని పడవ ప్రయాణం !

తీరమెందుకు? పడవ ఎందుకు? ప్రయాణమెందుకు?

ఆశ లేని జీవితం అందుకోగలనా?

నేను ఒంటరిగానే వచ్చాను అను జన్మ సంస్కారముతో !

ఒంటరిగానే వెడతాను నిష్కామ కర్మలనొదిలి !

చరిత ముగుస్తుంది

చరితార్థం ఒక కంకణము!

★★★★

# అవ్యక్తం

## డా.జయంతి రమేష్

భాష, భావవ్యక్తీకరణకు మూలం

వ్యక్తంకాని భావం అవ్యక్తం

మాటలకందని భావం అవ్యక్తం!

వ్యక్తావ్యక్తాల సమ్మేళనం మృదుమధురసంభాషణం

భావసారూప్యతకు, వ్యక్తిత్వవికాసానికి అది అధారం

ఆత్మీయ కరచాలనం ఒక అవ్యక్తభావ ప్రకటనం

చనుబాలనుతాగే పసిపాపను నిమిరే తల్లిభావం అవ్యక్తం

సాయం సంధ్యలో సాగరతీరాన చిరుగాలి పలకరింత

అవ్యక్తం,

ఆకలిగొన్ననిరుపేద కడుపుకి పట్టెడన్నం దొరికిన క్షణం

ఆ ఆనందం అవ్యక్తం,

కరవుకాలాన బీటవారిన భూమిపై కురిసే చిరుజల్లుకి

పుడమితల్లి పులకింత అవ్యక్తం,

మనసుపలికే అవ్యక్తరాగమే మౌనరాగం

వసంత కోకిల గానం మరుమల్లెలువిరిసే కాలం

విరజాజులమలయ సమీరం వ్యక్తానికి అతీతం అంటూనే

వ్యక్తం చేస్తుంది ఎంతో

--------------.అదే అవ్యక్తం.

★★★★

## ఆలోచనా లోచనాలు
## యామిజాల జగదీష్

ఆలోచన

ఏఏ నాలుకలను
ఎవరెవరు ఎరుపెక్కిస్తారనేమో
తీగలపై తీవ్రసమావేశంలో
తమలపాకులు!!

ప్రశ్న

నీళ్లను సీసాల్లో నింపేసి
మనుషులు మూతలు పెట్టేస్తే,
మరి దాహం తీరాలంటే
కాకులు , పిచ్చుకలు
ఏం చేస్తాయో! ఏమౌతాయో!!

సందేహం

ఏదో మరణవార్త విన్నప్పుడల్లా
మనం బతికున్నామా అనే సందేహం
బతికే ఉన్నాం కదా అనే సంతోషం!!
మృత్యువు జాబితా
అక్కడితో ఆగిపోతే
బావుండుకదా అనే చిన్ని ఆశ!!!

****

## సమిధ
## మల్లాది శ్రీ

ఏ ప్రగతి పథానికి ఇది సోపానం
ఏ పురోగతికి ఇది నిదర్శనం!?
అరాచకపు నీడలోన మనిషి నడత
విగతి గతిన మనిషి భవిత
అడుగడుగులో విధ్వంసం
ప్రకృతేకాని, ప్రకృతి రూపున ఆడదే కాని
మనవాడే కాని, పరాయి వాడే కాని
మన కోర్కెల కొలిమిలో ఎవరైనా సమిధలే!
మంచి పూత పూసుకున్న విషపు నవ్వులను
గుర్తించలేని అమాయకత్వం
అమానవీయత ముందు తలదించుతూనే ఉంది!
అమాయకులను బలితీసుకుంటూ
ఆకర్ణ భుజాలను చాచి
తన పశుకోరల్లో సమాజాన్ని బంధిస్తోంది
పాశవిక ఆనందం!
సర్వ అనర్థాలకు మూలం స్వార్థమేనని
తెలుసుకోని మనిషి
తాను రగిలించిన మంటలలో
తానే సమిధగా మారుతున్న దృశ్యం!!

★★★★

# వేసవి వచ్చేసింది ఆకుండి శైలజ

వేసవి వచ్చేసింది..

ఎలకోయిల రావాలను

ఎండల కరవాలాలను

తీసుకుని తోసుకుంటూ

మండు వేసవి వచ్చేసింది!

మామిడి రసాలను

మరుమల్లెల తావులను

పట్టుకుని నెట్టుకుంటూ

మండే వేసవి వచ్చేసింది!

ముంజెల ముత్యాలను

ముచ్చెమటల దాహాలను

దోసిలిలో నింపుకుని

వగరుస్తూ..వేసవి వచ్చేసింది!

వడగాలుల లీలలను

వాసంతపు హేలలను

వడినిండా పోసుకుని

వేసవి వచ్చేసింది!

శ్రీకారపు ఉగాదిని..

శ్రీరామ నవమినీ..

శీఘ్రంగా తోడ్కొని

వేసవి వచ్చేసింది

మళ్ళీ వేసవి వచ్చేసింది!!

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నీ హృదయముననింకను నిలుతునేమొ!
రాలిపోయితినో వత్సరముల వెనుక?
గతములో జారిపోయిన స్మృతులవన్ని
ఎన్నడును నీ యెదను కదిలించవేమొ!

నన్ను వదలి మిగిలితివొంటరిగ నీవు
దూరతీరాననెక్కడో తోడు లేక
స్పందనను మరచిన మానసమ్ము నీది
ప్రాణరహితమై తోచును ప్రకృతి నీకు

దారి తోచని సుంత యర్థమ్ము కాని
అంధకారమ్ములో తిరుగాడనేల?
కనులతో కాక కాంచుము మనసుతోడ
మనసులో కనుగొందు నా మనసు నీవు

నా తలంపులు రాగజన్యములటంచు
తలపులే తుదకగును వాస్తవములంచు
తరలిపోలేని ప్రేమ నిత్యమ్మటంచు
తెలియు నాడునేడును నీకు తెలియు నాకు

భావములు లేని నిస్సార జీవనమున
గతము మరపునబడి భావి కనగలేక
గడపగానేల జీవితకాలమెల్ల?
బరపుమీ వెల్గులను మన బ్రతుకులందు

*****

# సుతి మెత్తని ఉదయం

నాగరాజు రామస్వామి

నా గది కిటికీ నా మరో కన్ను

నులి వెచ్చని కిరణ స్పర్శ సోకీ సోకగానే

కిటికీ రెప్పలు తెరచుకుంటాయి

వేకువ తెరలు తొలగించుకుంటూ

నేను చూపుల పిట్టనై లేచిపోతాను.

ప్రతి ఉదయం అక్కడ

పువ్వుల ఆత్మీయ సమావేశం సాగుతుంటుంది

రాత్రి నూరిపోసిన రహస్యాలు లేత కబుర్లవుతుంటాయి

వాటిది మౌన వర్ణాల వాక్కు

మృదు పరిమళాల భాష

సన్న కిలకిలల స్వరరాగ నేపథ్యం

రాత్రంతా గాలికి అత్తరులు పూసిన సిత పారిజాతం

నేలమీద తెల తెల్లని ముగ్గై పరచుకుంటుంది

ఉషస్సు వదలి వెళ్ళిన పచ్చిక మీది పాదాల పచ్చి ముద్రలను

సుకుమారంగా ముద్దిడుకుంటుంది నును లేత పవనం

ఎర్రమందారం సుతారంగా కిరణ పానీయం సేవిస్తుంటుంది

పూల కల చెదిరి పోతుందేమోనని

కొమ్మమీది ఎల పరువాల గువ్వజంట

మెత్తగా ఒత్తిగిలి సర్దుకుంటుంది

చిన్ని సూరీడు చిన్నగా భూపాల రాగాలు తీస్తుంటాడు

రంగు రంగుల "అంతర"లను అందిపుచ్చుకుంటూ

పూల చరణాలు కదిలి పోతుంటాయి

వేకువ పిట్ట కువకువ స్వరాల సద్దుతుంటుంది

పూజా పుష్పమై కనులు విప్పిన నిద్రగన్నేరు నీడలో

పూల "వర్ణాలు", సుమ "కోమల స్వరాలు"

లలిత "రాగమాలిక"లౌతుంటాయి

పవన పక్షాల మీద పాట తేలి పోతుంటుంది

అదిగో అక్కడ

పున్నమి రాత్రి రాల్చిన వెన్నెల దారాలతో

పూలమాల లల్లాలని చూపుల పిట్ట

చెట్టూ చెట్టూ చుట్టు చంచరీకమై సంచరిస్తున్నది

ఒక పద్యమైనా మొగ్గ విడువకుంటుందా అని

ఒక్క గీతమైనా పూయకుంటుందా అని

ఉష్!... మాట్లాడకండి

పసి పద్యం ప్రాణం పోసుకుంటున్నది

సద్దు చేయకండి

పాటల పుష్పం పురిటి గీతమై కళ్ళు తెరుస్తున్నది

నిశ్శబ్దం సుమండి

సుతిమెత్తని ఉదయం కనురెప్పల కింద

కవిత్వం కంటిపాపై కదలుతున్నది

Silence Please

The baby is developing ★★★

# తస్మాత్ జాగ్రత్త రావెల పురుషోత్తమరావు

అరిచే కుక్కలు కరవవు

కరిచే సృగాలాలు అరవవు

అరవని కరవని శునకాలు

ఎక్కడా దొరకవు

క్షమించండి !! ఇది నిన్నటి శ్రీ శ్రీ బోధించిన నిజం

నేడు సీనంతా తారుమారయింది

ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అంతటా

ఎంతబడితే అంత

ఎక్కడ పడితే అక్కడ మేసే

కుక్కల హడావిడే

నేతల ప్రసంగాల సభల్లో

చప్పట్లు కొట్టే అద్దెకొచ్చిన కుక్కలు

సరిపడని వాడి సభలో వేడిగా నినాదాలతో

రాళ్ళు చెప్పులు వాటంగా విసిరేసే

అలజడి సృష్టించే ఆందోళనల సృగాలాలు

ఎక్కడబడితే అక్కడ

యేదిబడితే అది తినేసే ,వీధికుక్కలు

నిత్యజీవితంలో దర్శనమిస్తాయి

అరిచినా కరవకపోయినా

అన్నిరంగాలను ఆక్రమించేసి

అసహ్యాన్ని కలిగిస్తున్నాయి

నవ్వుకూడా ఇప్పుడు

కార్పొరేట్ కబంధ హస్తాల్లోకి

జారి పోయే వీలు కలుగుతుంది

ఆక్సిజన్ ,లాబరేటరీల్లాగా

నవ్వుల క్లినిక్ లు నగరాలంతటా

విస్తరింపజేసే ప్రణాళికలొస్తాయేమో

వేచిచూడండి

ప్రపంచ బ్యాంకు నిధులురానే

వాళ్ళ నిబంధనలకు అనుగుణంగా

విధులు, నియమాలను రూపొందిస్తారు కాచుకోండి

నవ్వడం ఇక భాగ్యవంతులకే

పరిమితమయే వీలుకలుగుతుంది

తస్మాత్ జాగ్రత్త

★★★★



# అంతర్ముఖం

## వీరేశ్వరరావు. ఎం.

కలల బూడిదను
కన్నీటితో రంగరించి
కాలానికి వంతెన కట్టినప్పుడు,
హృదయఘోష
విప్పలేని భాష
ఓడిపోయినప్పుడు,
అన్ని సత్యాలూ అర్థ సత్యాలై,
అన్ని బంధాలు నిర్భంధాలై,
అంతర్ వీక్షణకె
అంతర్నేత్రాన్ని తెరిచినప్పుడు,
ఆది అనాదిల
అన్వేషణ అంతమైన చోట
అంతర్వేది అయినప్పుడు,
విలువల అగాధాల్లో
అలౌకిక వెలితి
మూలుగుతున్నప్పుడు,
మిథ్యా విలువల సౌధాలు
కూలుతున్నప్పుడు
మదిలో అంతర్మధనం మొదలౌతుంది!
అంతర్ముఖమై
సుప్త చైతన్యం
జాగృతమవుతుంది!!.

★★★★

# ఎలా మరవడం!

## జాన్ హైడ్ కనుమూరి

తనువంతా మేఘమై తడిపిన కాలాన్ని ఎలామరవడం!
జ్ఞాపకమైన రాగమేదో పదేపదే వినబడితే ఎలా మరవడం!

కరుణించే కన్నుల్లో కదలిసాగిన అలలన్నీ
కాగితపు పడవలైన బాల్యపు అడుగులన్నీ ఎలా మరవడం!

వల్లప్పల పాటలలో కలిసి ఆడిన స్నేహహస్తం
సవ్వడిచేసే గానమై వెనువెంటే రావడం ఎలా మరవడం!

చిరుజల్లులలో ఏరిన ముత్యాల చినుకులు
చెలిచెక్కిలిపై నడయాడి మెరవడం ఎలా మరవడం!

సంధ్యకెదురైన చుట్టం వాలుసంధ్యలో వర్షం
రాత్రి విడువని జ్ఞాపకమై వేకువకెటోవెళ్తే ఎలా మరవడం!

తడిపొడి చినుకుల్లో తడబడు అడుగుల్తో
కదిలే పాలరాతి శిల్పాన్ని మరిపించడం ఎలా మరవడం!

ఉరిమిన ఉరుములలో భయపెట్టిన జాడలు
ఎదిగిన వయసు నేర్పిన ధైర్యపు మూటలు  ఎలా మరవడం!

కలలాగా సాగిన మబ్బులవెంట పయనం
'జాను'పాడేగీతికల్లో మురిసిన అనుభవాన్ని ఎలా మరవడం!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

హిమములు సుమములై హాయినెదను నింపి
కరగి కలసిపోయినవెట్లొ గతమునందు
సుమములు హిమములై నేడు సొగసులొలుకు
గతము కరుగదు కన్నుల కట్టునంచు

మరలిపోయినదెటకొ హేమంత ఋతువు
ఎక్కడను కానరాదొక్క హిమపు తునక
వెచ్చనౌ వాయువుల నించు వేసవి యిది
వచ్చి తాకదు శీతలపవనమొకటి

వేసవిని వీడి ముందుకు వెడలజూతు
వెడలుచో కోరెద మరల వెచ్చదనము
అంతమే లేని వర్తుల యానమిద్ధి
కష్ట సుఖముల విడదీయ గలుగునెవరు?

ఈ దినము దాటి ముందునకేగగలము
చింత లేనట్టి గమ్యమ్ము చేర దలచి
ఎగుడు దిగుడును లేని చోటెరుగగలమె?
ఎక్కడున్నది? ఉన్న వాంఛించునెవరు?

అలికిడన్నది లేని నిశ్చలతలాన
అనుభవము శూన్యమానందమపరిచితము
ఎవ్వరును వసింపని శూన్యగృహమునందు
కలతలుండవు, కనరావు కిలకిలలును

*****

# మాటల తూటాలు

రాళ్ళబండి శశిశ్రీ

అవి తూటాలు, చురకత్తులు
గుండెను చీలుస్తాయి
కర్కశంగా
నెత్తుటిబొట్టు ఒక్కటైనా
రాలకుండా
మనిషిన దాగిన అహంకారాన్ని
నిలువెల్లా కుప్పకూల్చేలా
అమ్మో! మాటలెంత పదునైనవి
అవి ఉత్ప్రేరకాలు స్ఫూర్తిదాయకాలు
వెన్ను తట్టి మన వెంటే ఉంటాయి
గట్టి తలంపుకు బాసటగా నిలుస్తాయి
పట్టు తప్పిన బ్రతుకుల్ని
దారికి మళ్ళిస్తాయి
ఉన్నత శిఖరా రోహణకు
సోపానాలమరుస్తాయి

కళ్ళల్లో జ్యోతులు వెలిగిస్తాయి
కాంతిమయం చేస్తాయి
అహో! మాటలెంత శక్తివంతమైనవి
అందలమెక్కిస్తాయి
ఇలపై ఇంద్రుణ్ణి చంద్రుణ్ణి చేస్తాయి
'ముఖస్తుతి 'గా మోసంచేస్తాయి
నాయకుల నాలుకలపై నాట్యం చేస్తాయి
'వాగ్ధానాలు 'గా మాయ చేస్తాయి
అమాయకులతో ఆటలాడుకుంటాయి
అబ్బా! మాటలెంత మభ్యపెడతాయి
నవనీతమౌతాయి మదిగాయాలకు
హిమశీతలమౌతాయి గుండెమంటకు
మలయ సమీరాలౌతాయి
అలసిన మనసుకు
కన్నీరు తుడుస్తాయి కరుణ చూపెడతాయి
ఆహా! మాటలెంత మృదువైనవి!! ***



# పాఠశాలల జైళ్ళు

జ్వలిత

ప్రతి పాఠశాల ఒక తీహార్ జైలు
మూలమూలన ఒక అపసవ్యపు యజ్ఞోపవీతం
స్వమర్ధన పరస్పర మర్ధనతో అంతా నిత్యానందమయం
అసమర్ధుల సమర్ధవంతపు సమర్ధనలు సర్వత్రా సత్యం
సమర్త కాని బాలబాలింతల ఉత్పత్తులు నిత్యం
ప్రతి విద్యార్థి అండర్ ట్రైల్ నిందితుడే
అనధికార జూదశాలలై
అధికార పాక(న)శాలలౌతున్న పాఠశాలల్లో
కేర్‌ఫ్రీలతో ఖాళీ కవర్లతో
ఎవరైనా ఎన్నిసార్లయినా లోబరుచుకోవచ్చు!
చెదపురుగులు చీడపురుగులు
చీమలకు సీతాకోకచిలుకలకు
జీవితాన్ని బోధిస్తామంటూ బాధిస్తాయి
బృహన్నలలు కలియుగ కుంతులను సృష్టిస్తుంటారిక్కడ
అపర భీష్ములు అంపశయ్యలను దిగరు
అపర ధర్మరాజులు పాఠాల సమయాన్ని
బంగారు జీవితాల్ని ఫణంగా పెట్టి జూదాలాడుతారు
అపర గాంధారులు చర్చల ప్రపంచాన్ని తిరిగేస్తూంటారు
అహంకార కళల్లో మారిన రంగులు కొన్ని
సిరా రంగులు మారి అహంకరించేవి మరికొన్ని
మోహసాలీళ్ళు లోహపు గూళ్ళతో వలలు పన్నుతూంటాయి
మోదుగపూల వనాలు తగలబడుతూ వెలుగుతాయి
పురుగులు మాడిపోయి, పూలు కాలిపోయి
మిగిలిన బూడిద కుప్పలను పాలిస్తారు రాణులు

****

# అక్షరం బాధ

## అమూల్య తెర్లి

నోరు తిరగని న్యాస్టీ లెటర్స్ అంటు

స్పష్టత లేని స్టుపిడ్ లాంగ్వేజ్ అంటు

పచ్చని అక్షరాన్ని పచ్చడి చేసి

లక్షలు కురిపించే అక్షరాల్ని క్షవరం చేసి

మేకప్ అద్ది, గొంతులో మిక్సీ వేసి

రీమిక్స్ చేసి, నత్తినత్తిగా, అమాయకంగా

స్టైలిష్ గా పలుకుతున్న నేటి యువతను చూసి

అక్షరం బాధపడింది.. !!

****



# చేజారిన పుస్తకం

## డా.నీరజ అమరవాది

నీ చిరునవ్వు
నా మదిలో చిరుగంటలు
మోగించింది -
నీ ఆప్యాయత
నాలో కొత్త ఊహలకు
ఊతమిచ్చింది -
నీ స్నేహం
నాలో మరువలేని
తీపి భావాలను నింపింది
నీ ఆరాధకుడిని చేసింది
నీ అభిమానిని చేసింది -
అలా నా మది పుటలు
నీ జ్ఞాపకాలతో నిండాయి
సహస్ర పూటల పుస్తకమైంది!
ప్రతి పేజీ మధురమే !!
అందుకే
ప్రతి పంక్తిని మళ్లీ మళ్లీ  చదువుకున్నాను -
ముందు నుండి వెనక్కి
వెనక నుండి ముందుకి
చివరి పేజీ నుండి ముందు పేజీ వరకు
తిరగేసి చదివాను
ఎంత చదివినా ఎలా చదివినా
సప్తస్వర సరగాలాపనే !
కానీ సిలబస్ ప్రకారం
పుస్తకాలు మారిపోతాయని
కొత్త  సిలబస్
సరికొత్త ప్రమాణాలతో ఉందని
నా పుస్తకం పాతదని చింపి పారేస్తావా ?
ఆ పాత పుస్తకం.. నా మనసు !!!

****

# నిష్క్రమణ

నాదెళ్ళ అనూరాధ

ఆ వేసవి సాయంకాలం
అకస్మాత్తుగా అతిథుల్లా వచ్చిన వర్షపు చినుకుల మధ్య,
నువ్వూ నేనూ అపరిచితులమై ఆకాశం కింద నిలబడినప్పుడు
ఎందుకో అర్థం కాని దిగులు !
అమ్మ మీద యౌవనారంభం నుండి తరచూ వచ్చిపోయే అలక
ఒక ఒంటరి తనపు దుఖం !
ఎవరు నువ్వు ?
ఇంద్ర ధనుస్సు రంగుల్ని ఒక్కోటిగా నీలోంచి,
నీ చుట్టూ చూస్తూ నిలబడిన నన్ను కమ్మిన అచేతనత్వం !
కలుస్తూ విడిపోతున్న క్రొత్తదనపు చూపుల మధ్య
అభావంగా ఉన్న నీ ఉనికి !
చెల్లాచెదరవుతున్న ఏడేడు  రంగుల్ని పట్టుకోలేక  ఓడిపోతూ
నీ నుండి చూపులు మరల్చుకున్న వైనం !
ఆ క్షణాలు ఏదో అలౌకిక తీరాలమధ్య కదులుతున్నట్లు
మరింత అయోమయంగా నిస్సహాయంగా నిన్నల్లుకున్న చూపులు !
నీ అందమైన కన్నులు నిండిన విస్మయం !
నా గుండెల్నిండా వెర్రిగా గుబులు రేపుతూంటే
చటుక్కున మెట్లు దిగి వెళ్ళిపోయాను!
ఇప్పుడు....
ఇన్నాళ్ళ సహచర్యం, ఇన్ని గుసగుసల తాత్పర్యం, ఇన్నిన్ని కోపాల నేపథ్యం ,
మరెన్నో ఆవేశాల మాధుర్యం !
నా చైతన్యాన్ని నా నుండి లాక్కుని,
నన్నొంటరిని చేసి ఇప్పుడే  వస్తానంటూ వెళ్ళిన నీ అడుగులు !
నన్నో జడుడిని చేస్తున్నావో,
నన్నో తపస్విని కమ్మని శపిస్తున్నావో !?
ఈ తపస్సులో నన్ను సజీవ సమాధిని చేస్తున్నావు  సుమా !
పరుగున వచ్చి గడ్డ కట్టిన శైతల్యాన్ని పగులకొట్టి
వెచ్చని చిగురువై నన్నలంకరించవూ ?    ****

# అక్షరాశ్రువులేరుకుంటూ..

చల్లా రామఫణి

ఇప్పుడిక్కడ కోకిలలూ లేవు; కాకులూ లేవు , వసంతాలూ లేవు, వావి వరుసలూ లేవు,
ముక్కంటి కిరణాలు మన్మధుణ్ణే కాదు అష్టావక్రుణ్ణీ వదిలిపెట్టడం లేదు,
జన జీవన నిత్య యానానికి ప్రతీకలైన బస్సులు - సంచార మానభంగ సౌలభ్య శకటాలయ్యాయి,
ఆకాశంలో సగం - మానవజాతికి మానభంగ పరికరమయింది,
పరిసరాలేవైనా అతివ - చనువుకు అనువైన పరికరమేనంటూ జాతి జంతు బంధువైంది,
జంతూనాం నరజంతు సులభం !
అప్పుడు కోక లాగితే గుండెలు తీసి నెత్తురు తాగడానికి నేల కురుక్షేత్రమైంది,
ఇప్పుడు మానభంగమైతే ప్రపంచమంతా నీ పేరు వీర వనితలా స్మరిస్తుంది,
పురస్కారాలు పుట్టుకొస్తాయి - నీ ఇంటికి దేశాధినేతలొస్తారు,
మానభంగంతో చచ్చి అంతర్జాతీయ ప్రఖ్యాతి తీసుకొస్తావు కన్నవారికి,
నీ జీవితం నష్టపరిహారంతో సరి!
ఇప్పుడు ఇక్కడ సిగ్గుపడకపోవడమే విజయం! సిగ్గులేకపోవడమే వీర విహారానికి విజయ సంకేతం !
నాగరికత నాశనానికి విత్తనం వేసిన వాడిదే విజయం,
నాగరికతలన్నీ నారి వెతల చరితలే,
ఈ సంవత్సరం నాగరికతకు అపజయ నామ సంవత్సరం,
అనాగరికతకు విష బీజాలు వేసిన విషమ నామ సంవత్సరం !
ఇప్పుడిక్కడ విజయోత్సవాలకు సిగ్గు బిళ్ళలు పీకేశారు,
అమ్మకు, అక్కకు, చెల్లికి ఆటోలోంచి దూకడం రాకపోతే -
కారు తలుపు తెరుచుకుని పారిపోవడం చేతకాకపోతే మానవ మృగాల ఆకలికి హారతైపోతారు !
ఆనందంగా పసుపు కుంకుమలతో తిరగాల్సిన వాళ్ళు మిరియాల పొడి,
కారప్పొడి ఎక్కడ దొరుకుతాయా అని అంతర్జాలాన్ని జల్లెడ పట్టేస్తున్నారు,
ఎందుకు విజయ నామ అష్టోత్తరాలు! జయజయ నినాదాల ప్రతిధ్వనులు!
బుద్ధిలేనితనానికా భుజకీర్తులు !?
ఇక్కడిక ప్రతిరోజూ వికృత నామ దినోత్సవమే ! ప్రతి సంవత్సరం వికృత నామ సంవత్సరమే !
అమ్మలు, అక్కలు, చెల్లెళ్ళ చూపుల్లో ఇప్పుడు ఒకటే భావం - ముభావం, అపనమ్మకం,
ఎదిగిన కొడుక్కి కూడా తల్లి దూరంగా ఉండాలన్నాట్ట మనువు,
మానవునిలో మృగాన్ని, మానవుని లో మృగ ధర్మాన్ని తెలిసి మసలకపోతే పుడుతుంది ముసలం!
దేహాకర్షణకు దేశాలే నాశనమయ్యాయి - నాగరికతలే నశించిపోయాయి ,

చరిత్ర సృష్టించినవాళ్ళెందరో చరిత్ర చెత్త బుట్టలోకెళ్ళిపోయారు,
ఎక్కడ స్త్రీలు మానభంగాలకు గురవుతుంటారో అక్కడ రాక్షసులు తిరుగుతుంటారు,
అని ప్రపంచమంతా ప్రకటనలిచ్చి మన జాతి ప్రవర్తనకు ప్రమాణ పత్రాలిస్తుంటే
ఎక్కడ నీ భగవద్గీత ? ఎక్కడ నీ వేదాలు ? ఎక్కడ నీ ఉపనిషత్తులు ?
మనిషిని మనిషి మనిషిగా చూడాలని చట్టాలు చేసుకునే స్థాయికి ఎదిగామా? దిగజారామా!
విజయ నామ సంవత్సరమా! నువ్వేం విజయాలు తేగలవు మాకు?
అమానవీయతే అలంకారంగా బతుకుతున్న మాకు,
నిన్ను స్వాగతించలేను, ఛీత్కరించి పొమ్మనలేను!
నీ కోసమే అందరి ఎదురు చూపు - జీవితమంతా !
అనాగరికుల కోసం కవిత్వం కాలేమని ఏడుస్తూ పారిపోతున్న అక్షరాలని బతిమాలి బామాలి పట్టుకుని
కవిత్వంలా నిలబెట్టేసరికి ఆత్మలు అల్లాడాయి!
మానభంగ నామ సంవత్సరాన్ని మరచిపోయి విజయ నామ సంవత్సరంలోకి వెళతావా
అని చొక్కా పట్టుకుని నిలదీశాయి!
విజయ నామ సంవత్సరమా! మమ్మల్ని మన్నించు !
ముందు మాకు మానభంగాలు లేని ప్రపంచాన్నివ్వు,
మా అక్కలు, అమ్మలు, చెల్లెళ్ళు ఆటోల్లోంచి, కారుల్లోంచి దూకకుండా బతికే భయంలేని జీవితాన్నివ్వు,
మమ్మల్ని నమ్ము - నువ్వు మమ్మల్ని మనస్ఫూర్తిగా వరించే అర్హత సాధిస్తాము,
విజయ నామ సంవత్సరమా! మా విజయ సాధనమా ! విజయ సాగరమా !
గత కాలపు విష జ్ఞాపకాల సమాధులపై ఎగిరే విజయ కేతనమా! నీకు స్వాగతం!
రేపులేని భారతమొద్దు, రేపుల్లేని భారతమివ్వు,
చింతల్లేని చిరునవ్వుల విజయాన్నివ్వు, చిరకాలం నిలిచే విజయాన్నివ్వు!
తలెత్తుకుని తిరిగే విజయాన్నివ్వు!

(ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఉగాది కవిసమ్మేళనంలో చదివిన కవిత)



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ఎవరి కొరకై పుడమి జనియించియుంటి
ఎవరికై యనుదినము జీవించుచుంటి
ఎవరి యూహల నింపుదునెడదనెపుడు
ఎవరికై ప్రాణమిచట బంధింతునెపుడు

ఎవరు నా యెదలో వసియింతురెపుడు
ఎవరు నా యోచనల చరియింతురెపుడు
వారలేగిరెటకొ నను వదలి నేడు
బాట శూన్యమ్ము బ్రతుకు నిష్ఫలము నేడు

ఏల హృదయమ్ము తోడు కాంక్షించునెపుడు
విడిన బంధమ్ముకై విలపించుకొరకు
చెలిమి కనరాని యేకాంత సీమ యందు
బ్రతుకు పండుటె హృదయసాఫల్యమేమొ

వదలిపోదురు కొందరు బాల్యమందు
వెడలిపోదురు కొందరు వివిధదశల
రాగమె పలుచనౌను జరత్వమందు
ఏల గమ్యమ్ము ప్రేమరాహిత్యమయము

వలయు పుట్టినప్పుడు ప్రేమ బంధనమ్ము
వలయు బ్రతుకెల్లనేవేవొ బంధనములు
అరుగుటొక్కరొక్కరె జీవితావసరమ్ము
సిద్ధమగుటకు నిశ్చలస్థితిని చేర

*****

# కవితెవరిది?

విజయభాస్కర్





నాలోంచి నిద్రలోకి జారుకుంటుంటే..

ఓ కల ఎదురొచ్చింది.

ఈ కవిత నాదంటే నాదని..

కాగితం.. కలం..హృదయం..

కవి ఎదుట ఒకటే వాగ్వివాదం.

నాలో ఇంకిపోతేనే కవిత అది..

అంటోంది కాగితం.

నన్ను చీల్చుకుని వస్తేనే కదా,

నాదీ అసలు త్యాగం..

అంది కలం.

అనుక్షణం స్పందించే హృదయం,

ఊరుకుంటుందా..

నలిగి.. కరిగి..  ఒదిగేది నేను అంది.

అయినా కవి మాట్లాడ్డేం ?

లోలోపలే నవ్వుకుంటున్నాడు.

తనకి తెలుసేమో..

ఈ కవిత కేవలం జ్ఞాపకానిది అని.

దాన్ని గుండె తన ఒడిలో దాచుకుంటే..

కాలం కలం గా మారి..

జీవితపు కాగితంపై కవితగా,

రాసిపెడుతోందనీ.. తెలుసేమో..

ఇంతకీ ఆ కవిత పేరు ?

"రేపు" మెలుకువొచ్చింది.

****

# అతని నవ్వు

నాదెళ్ళ అనూరాధ



అతనూ ,ఆకాశం నిరంతరం నా వెంట వస్తూనే ఉంటారనుకున్నా,
అప్పుడెప్పుడో.....
దశాబ్దాల క్రితం అతని చేతిలో చెయ్యేసి నడవటం నేర్చుకున్నా
అది మొదలు అలవాటుగా నడుస్తూనే ఉన్నాను.
అలుపే  తెలియనట్లు నడుస్తూనే ఉన్నాను.
కిటికీలోంచి  ఉరిమే మేఘం ఝడిపించినా
వాకిలి దాటితే వెల్లువెత్తే జనప్రవాహం ఉక్కిరిబిక్కిరి చేసినా
' భయం నీ ప్రకృతి ,అంతే ' అంటూ నవ్వేవాడు!
నిజమేనేమో!
ఆ రోజు అకస్మాత్తుగా ఒక అస్వస్థత అతన్ని కమ్మినప్పుడు మాత్రం
భయం మర్చేపోయాను.
ఆ క్షణమే నన్నొక ఆరిందాతనం అల్లుకుపోయిందనీ తెలియనేలేదు .
ప్రపంచానికి నేను నేనుగా కాక మరో నేనుగా ఎదురుపడ్డాను. .
పోరాటంలో గాయాలు లెక్కలేదు, విజయమే కదూ గమ్యం !
ఆపరేషన్ థియేటర్ దాటి వచ్చి ఒంటరిపోరాటం  చేస్తున్న అతన్ని
చూస్తూ గడిపిన  రాత్రులు .................
చెయ్యి చాస్తే అందే దూరం లోనే ఉన్నా
బాధని ఇసుమంత కూడా పంచుకోలేనితనానికి నివ్వెరపోయాను .
అతనికీ ,నాకూ మధ్య విచిత్రంగా ఈ దూరాలెక్కడివో?!
క్రొత్తగా ఈ " ఏమీ కాని తనం " ఎక్కడిదో ?!
ఇది భౌతికమా ?మానసికమా? ఆధ్యాత్మికమా?
ఇదివరకెన్నడూ పరిచయమే లేదు.
లోలోపల ఎక్కడో ఘనీభవించినట్లున్నదేదో
అంతలోనే వెల్లువై ఉరికింది , ఎప్పటిదో ఓ జ్ఞాపకం ............
రిషీకేష్  వెళ్ళాలి, గంగ దూకుడు చూడాలని పేచీపెట్టి మరీ వెళ్ళి ,
ఆ శీతాకాలపు ఉదయాన
వడివడిగా ఉరుకుతున్న నదీమతల్లిని చూసి
నిశ్చేష్టనై కన్నీరెట్టుకున్న నన్ను చూసి - అతను నవ్విన నవ్వు....!



****

# సజీవచిత్రం

## మధు పెమ్మరాజు

రోజూ మారే గమ్యాలకి
మెలికలు తిరిగే పట్టాలకి
అలసి సొలసి
అర్థం వెతుకుతుంటే
కిటికీ కాన్వాసుపై ఓ సజీవ చిత్రం

నిర్మల ప్రకృతిలో ఒంటరి వెదురుపాక
అచేతనమే అద్వైతం
నిశ్చల నిశ్శబ్దమే ఓంకారమని
నిరంతర పరుగుల బడలికను
స్వాంతపరిచిన పర్ణశాల

పరిధులు మరిచి
స్వేచ్ఛలో మైమరచిన క్షణం
పెరిగిన రైలు వేగం, కదిలే కాలం
కంటి ముందు కలని చెరిపి
వాస్తవానికి నన్ను చూపింది

నేస్తమా? నీకెందుకు తెగువలేని తపన
మజిలీ రాగానే దిగిపోతావు
మగతగా నీ ప్రపంచంలోకి నడిచి పోతావు
ఆ చిత్రాన్ని గది గోడపై, గుండె గదిపై
ఆశించే లోకపు ప్రేరణగా దాచుకో

****

# బుద్ధదేవుని భూమిలో..

## సారథి మోటమర్రి

మూర్ఖ మూఢాచారాల అవధుల్లో
నర జంతు కుత్తుక లెగురుతుంటే —
వేడి వేడి రక్తం వెల్లువలా పారుతూ
సింధూ వరదను మరిపిస్తుంటే —

వేదం, యాగం, దేవుడు అనేవి
పెడార్థాలుగా విజృంభిస్తుంటే —
ప్రేమ, అహింస, కారుణ్యాలు
పునాదులుగా జాతిని నిలిపావోయ్!

నాగరికతా వికాస ముసుగుల్లో
మనసు, మమతలు బలియవుతుంటే —
మానవత సజీవంగా కాల్చబడుతూ
పైశాచానికి పరాకాష్టగా వెల్గొందుతుంటే —

ఆర్ష ధర్మాలు వేలితో వెలవెల బోతూ
త్రిరత్నాలు త్రిశంకు స్వర్గంలో లీనమై...
జాతి, సంస్కృతి అధఃపాతాళానికి జారుతూ
నేడు — మనసున్న మనిషిని నిలదీస్తుంటే —

మానవుల కన్నీరు మాన్పగా ఉదయించి
ధర్మ పదాన్ని చూపిన ఓ సిద్ధర్థా!
నీ స్మృతితో ఈ జాతి గతి మారేనా?
మమతలు పూచి వికసించేనా??

****

# తలపోతలు

నాగరాజు రామస్వామి



ఊహల్లో ఊరుతున్న ఒయాసిస్సులు
తరుఛాయలకు తలవాచిన తలపులు
తప్పిపోయిన ఒంటరి ఒంటె తలపోతకు
మండే మధ్యాహ్నాల  కానుక మరీచిక
సైకత తరంగాల మీద సాగుతున్న ఎడారి ఓడకు
బహుమానం సహారాలేని సాయం తీరం.
అరబ్బు గుర్రాల ఆటవిడుపు గుడారంలో
తలదాచుకునేందుకు నీడ దొరకదు లొట్టిపిట్టకు.
చెట్టు పాదాల కిందికి తప్పుకున్న మిట్ట మధ్యాహ్న ఛాయ
అరబ్బులందరూ అపర కుబేరులు కారు.

కలల్లో పరచుకున్న పచ్చిక బయళ్ళు
కళ్ళలో ఆరుతున్న ఆకుపచ్చని సిరులు
ఎముకలు తేలిన ఎద్దు ఎదురు చూపులకు
శుష్క వాగ్దానాల ఎండు గడ్డి బహుమతులు
ఆరు దశాబ్దాల నాడు రెక్క విప్పిన పక్షి
ఎగరాల్సిన ఎత్తులకు ఎగురనేలేదు
మహాభారత యుద్ధమింకా ముగియలేదు
గోవధ ఆగలేదు!



తొలి మానవుడు ఉదయించిన చీకటి ఖండంలోని
తిమిర తెరలింకా తొలగలేదు
పాతిక శతాబ్దాల ఎత్తులకు ఎదిగినా
ఆకాశాన్నందుకోలేదింకా సిక్వ్యోమియా మహా వృక్షం!
రాప్ రణగొణల రగడలో తప్పిపోయింది
లలిత పదాలను మోసుకొచ్చిన స్వరచరణం!

ఐనా ఇంకా లాగుతూనే ఉంది గుదిబండను
ఒంటెద్దు బండికి కట్టిన ఒంటె అస్థిపంజరం!

****

# కాఫీ దండకం జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

అనుదినమ్మును కాఫీయె అసలుకిక్కు
కొద్దిగానైనా పడకున్న పెద్దచిక్కు
కప్పు కాఫీ లభించుటే గొప్పలక్కు
అమృతమన్నది హంబక్కు, అయ్యలార!

జై కాఫీ! విశ్వాంతరాళంబులోనున్న బ్రహ్మాండగోళాలలో నీకు సాటైన పానీయమే లేదు ముమ్మాటికీ. అందుకే నిన్ను కట్టేసుకుంటాము మా నోటికీ. నాల్కతో నీకు జేజేలు పల్కేము నానాటికీ. ఎర్లిమార్నింగులో నిద్రలేవంగనే పాచిపళ్ళైనయున్ తోమకన్ త్రాగు బెడ్ కాఫి కోసమ్ము పెండ్లాముపై రంకెలేయించకే బెస్టు టేస్టేశ్వరీ! ఫ్రెష్షు కాఫీశ్వరీ! నెస్సు కేఫేశ్వరీ! జిహ్వకున్ సిద్ధి చేకూర్చవే బ్రూకుబాండేశ్వరీ! లోకప్రాణేశ్వరీ! ప్రాణదానేశ్వరీ! గంట గంటా ప్రతీయింట ఉప్పొంగవే ఉష్ణపానేశ్వరీ! స్టీలుఫిల్టర్ల పళ్ళెమ్ములోనున్న రంధ్రాలలోనుండి నీ సారమంతా, సుతారంగ జారంగ, నోరూరు చూడంగ, నా సామిరంగా నిజంగానె చచ్చేవిధంగా! కాస్త త్రాగన్ పునర్జన్మ వచ్చేవిధంగా! ప్రొద్దు ప్రొద్దున్నె నీ పొందు లేకున్న, మూడంత పాడయ్యి, టైమంత వేస్టయ్యి, కచ్చెక్కి, పిచ్చెక్కి, అశ్లీల సంభాషణల్ చేసి కాంటాక్ట్సు సర్వమ్ము నాశమ్ము కావించుకుంటారుగా! అందుకే నిన్ను అర్జెంటుగా తెచ్చుకొంటారుగా! దాచుకొంటారుగా! కాచుకొంటారుగా! చచ్చినట్టింక ఇచ్చేంత సేపందరున్ వేచి ఉంటారుగా!

మాతృగర్భంబులోనుండు పిండస్థజీవుండు ఆ తల్లి త్రాగేటి కాఫీని సేవింపగా వేచియుండంచు శాస్త్రజ్ఞులెన్నో ప్రమాణంబులన్ చూపెగా! ఈ కాఫి పానీయమున్ గూర్చి వేవేల సంవత్సరాల్ క్రిందటే ఋషుల్ వేదాలలో గొప్పగా చెప్పియున్నారుగా! ఎంత అప్రాచ్యమైనట్టి పానీయమైనన్ మునుల్ సమ్మతించారుగా! కాఫి త్రాగంగనే వాణి ఉల్లాసమున్ చెంది, ఆ కచ్ఛపీ వీణపై కాపిరాగంబు పల్కించుగా! ఇంత కాఫీని పోయంగనే ఎంత ముక్కోపియైనన్ ప్రశాంతుండుగా మారుగా! కర్మలన్ చేయు సద్బ్రాహ్మలైనా నినున్ కొంతసేవింపకన్ తద్దినం మంత్రముల్ పెద్దగా చెప్పగా లేరుగా!

పితృదేవాళికిన్ పెట్టు పిండాలపైనన్ నినున్ కొంత సంప్రోక్షణన్ చేసినన్, వారికిన్ దివ్యకైలాసవాసంబు కల్పించు వీసాలు శీఘ్రంబె వచ్చేనుగా! దేశదేశాలలో నుండి నీ గింజలన్ తెచ్చి, రంజిల్ల వేయించి, బాగా పొడిన్ చేసి, జల్లించి, దట్టించి డబ్బాలు సీసాలలో నింపుకుంటాముగా! శోభనం వేళ ఓ వెండిగ్లాసందు క్షీరంబులో యింత యిన్స్టెంటు బ్రూవేసి, పందారలా నవ్వు నవ్వేసి, కుర్రాడికిచ్చేస్తె తెల్లారెదాకింక థిల్లాన థిల్లానగా!

కాఫినంతెత్తుపై నుంచి ఓ కప్పులో వంచి, ఆ కప్పులో నుంచి ఈ కప్పులో పోసి, అట్నుంచి ఇట్నుంచి, ఇట్నుంచి అట్నుంచి, బాగా గిలక్కొట్టుచున్ నుర్గు ఉప్పొంగగా తెచ్చి ఇస్తారుగా! గొప్ప నిష్ఠాగరిష్ఠుల్ బరిస్టాలలోనన్ గరిష్ఠంబుగా కాఫి త్రాగేందుకిష్టంబుగా పోవుగా! షాపు మూసేయ వాపోవుగా!

అబ్బ, నీలోని ఆవిర్లు, వేవేల వేవిళ్ళు.. ఘుమ్మెత్తు నీ స్మెల్లు, గమ్మత్తుగా గిల్లు, మా ఇల్లు నీవల్ల శోభిల్లుగా! దిల్లు మొత్తంబు రంజిల్లుగా! రోజు మొత్తంబులో వందసార్లైన ఇంగ్లీషుముద్దిచ్చి రక్షించవే కాఫికామేశ్వరీ! యూత్తు జేకొట్టి లాగించు ఓ కోల్డుకాఫీశ్వరీ! నిన్ను వర్ణించి లాగించ నేనే సరైనట్టి వాడన్ చికోరీసఖీ! నీవు ముద్దాడుచున్ గొంతునాలింగనం చేసుకోగానే మా పంచప్రాణాలు చైతన్యమౌనే జగన్నాయకీ! నవ్యపానీయనారీ! వయారీ! నమస్తే! రుచిన్ మస్తుగా కల్గు ప్యారీ! మిఠారీ సలామే! నుర్గు నవ్వుల్లబ్యూటీ వణక్కమ్! డికాషన్ ప్రెటీ నీకు ముక్కోటి శాల్యూట్స్ వే!

స్ట్రాంగు కాఫీ సఖీ! పొంగి లంఘించవే! లైటు కాఫీ ప్రియా! లవ్వు పొంగించవే! కోల్డు కాఫీ చెలీ! గోల్డు బ్యాండెయ్యవే! బ్లాకు కాఫీడియర్! ఒక్క బైటియ్యవే! సర్వకాఫీ రసాంగీ! సుధాంగీ! శుభాంగీ! ప్రభాంగీ! నమస్తే! నమస్తే! నమః!

కాఫీజనాః సుఖినో భవన్తు
బాసూ! శీఘ్రమేవ కాఫీ ప్రాప్తిరస్తు!

(ఇందులోని కొంతభాగం 'మిథునం ' చిత్రంలో చోటుచేసుకుంది )



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వెడలిపోవుదమాకాశవీధులందు
ఆడుగులిడుదుము మబ్బుల యంచులందు
కలసిపోదము వెన్నెల కాంతులందు
తరలిపోదుము తారల దారులందు

పయనమౌదము రాయంచ పడవలందు
తేలిపోదము పొగమంచు తేరునందు
గువ్వలై కూరుచుందుము కొమ్మలందు
అలలమై తేలిపోదము జలధి యందు

తారలౌదుము రోదసీతలమునందు
వారికణములౌదుము జలపాతమందు
వింత సొబగులౌదుము హరివిల్లునందు
స్వరములౌదుము కోయిల పాటలందు

ఏల యీ నేల చిత్తమ్మునేలలేదు?
ఏల మానసమెచటికో యెగురజూచు?
పారిపోయెదమెవ్వారి బారినుండి?
సాగిపోయెదమేమి కష్టములనుండి?

నీ దరిని నేను, నాదు సన్నిధిని నీవు
కలసి యున్ననే కరుగును కలతలన్ని
కనులకందని స్వప్నలోకమ్ములన్ని
చెంతనే నిల్చి యానందసీమ గూర్చు

*****

# ఉత్కృష్ట కవనమార్గం ఎలనాగ



నది ఉప్పొంగుతూ

నడుస్తున్నట్టుండాలి వాక్యం,

పూలగుత్తులు ఊగాడుతూ

పుప్పొడితుఫానుల్ని విరజిమ్ముతున్నట్టు

ప్రతిపంక్తీ ప్రాణశక్తితో పరిమళించాలి,

మెదడుపొరల్ని చేరక ముందే

మెరుపుమేఘం అందాలి,

మాటల కూర్పులో

మామూలుతనం చొరబడితే

అనుభూతి పొంగదు-

అంతరంగపు బంజరునేల మీద

ఆర్ద్రతా హరివిల్లు వంగదు-

ఉక్కపోతలో మగ్గిన

మనోమరుభూముల మీద

ఉపశమన వర్షమై కురవాలి కవిత!

గాలి చొరబడని గది లోంచి

మనసును మలయసమీరాల్లోకి నడిపించినట్టు

హాయినివ్వాలి కవిత!

★★★★



# మట్టివాసన తమిరిశ జానకి



ఉదయాన తెరచిన కిటికీ

తిలకించమంది అద్భుతదృశ్యం!

రాత్రంతా నేలతల్లితో

చెట్టు చెప్పుకున్న

మురిపాల ముచ్చట్లు

రాలిన పారిజాత పుష్పాలు !

ఆరారగా అర్పించుకుంటున్న

ధన్యవాదాల ఆనందభాష్పాలు

మంచుబిందువులు!

ఎన్నెన్ని కబుర్లు కలబోసి

పరుచుకున్నాయి పరిమళ భరితాలై

ఒక్కొక్క ముచ్చట ఒక్కొక్క సొగసు !

కాచి వడబోసిన జీవితాల

గలగలల పాటల ఆర్తి

అవని ఎదమీద ఎండుటాకులు!

ఎన్నెన్ని రాగాలు కలబోసి

రాలాయి రాసులుగ వేదనాభరితమై!

సొగసులైనా చింతలైనా

అక్కునచేర్చి చిన్నబోవని

సహజ నవ్వుల నిగర్వి నేలతల్లి

మనిషి కేదీ ఆ మట్టివాసన ?



****

# సెలవిస్తారా?

శ్రీఅరుణం

అరుణానికి సెలవిస్తారా

అంబరమిక బ్రతికేదేలా?

చుట్టుముట్టిన సెగలపై చిరాకుపడి

తను పుట్టిన శూన్యం దగ్గరకే పొమ్మని

సాగనంపగల వారెవరసలూ ?

మనకు తెలీదా తన అస్తిత్వం శూన్యానికి శత్రువని.

జాగృతికి చుక్కానీలు రచించే..ఆ కావ్యగణితం

తన కిరణాలతో ఎన్ని వెలుగుల్ని బ్రతికిస్తుంది

ఆస్వాదనని హత్తుకొనే ఆ పిలుపు కోరాలే కానీ

తన జ్వాలానేత్రం నుండి ..ఎన్ని

నులివెచ్చని కంబళ్ళను

మన మంచునిద్రపై కప్పుతుంటుంది

నిరంతరం నిప్పుల్ని తను కాగుతూ

నవ్వులరేకుల్ని నీకు పువ్వులుగా అందిస్తుంది

ఆర్ధ్రత నిండిన భువిని తనివితీరా కౌగిలించుకొని

లోతుల వైషమ్యాన్ని బయటకు నెట్టేస్తుంది

ప్రేమతో ఆగినవారికి ..

ప్రేమనే పంపిస్తుంది .

పగతో వంచించేవారికి ..

లావాతో సమాధానమిస్తుంది .

మరి, ఎలా

అరుణానికి సెలవిస్తారు ?

తను లేకుండా ఈ నిశిలో

ఎన్నాళ్ళని దాక్కుంటారు?

****



# శంఖువు

జీవనగమనంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా
శక్తికి మించిన అలల తాకిడిలో కూడా అలవోకగా పయనించా
సునామీలైనా, సుడిగుండాలైనా  సునాయాసంగా తప్పుకున్నా
కఠినత్వపు ముసుగులో సున్నితత్వాన్ని దాచివేసా
అంతరాంతరాల్లో వెలుగు రేఖల్ని
విభిన్న జీవిత రహస్యాల్ని మౌనంగా చూసా
అగాధాల అడుగున దాగిఉన్న సౌందర్యాన్ని ఆరాధించా
ప్రపంచానికి తెలియని వింతల్ని, విశేషాల్ని తిలకించా
ఎదలోతుల్లో ఎన్నెన్నో కలల్ని పోగుచేసుకుని
ఆశల తీరంలో హాయిగా పయనించా
నాలో జీవం కనుమరుగైన రోజు
కఠినత్వపు తొడుగులో అందరికీ కన్పించా
వేలవేల జీవితాల్ని చూసి కూడా వెలవెలబోతూ నిలుచున్నా
అలల ఒంపులతో ఆడుకుని వాటి తాకిడికే నిర్జీవినై పడిఉన్నా
నీలాకాశపు నీడలో నురుగు తరగలలో తేలియాడి
చివరికి మట్టి పొరల్లో మగ్గిపోతున్నా
జీవితం ఇంత చిన్నదా
కానీ, బాహ్యరూపంలో కూడా నా ఆత్మ జీవించే ఉంది
నన్ను తాకిన వారికి నా స్వప్న వృత్తాంతాల్ని వివరిస్తా
నా మనసును కదిపిన వారికి నా మరణ ఘోషను వినిపిస్తా

వాణి చిలకలపూడి

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ప్రొద్దుపొడుపుననిల సరిహద్దు దాటి
ఇరుల గుంపులెల్లను కన్ను మరగినపుడు
తరణి బాలుని నునులేత కిరణములను
పుడమి బంగరు మైపూత తొడగినపుడు

మెల్ల మెల్లన మునురేయి యెల్ల జాలు
వారి హిమబిందువులు నిల్చె పచ్చికలను
ఇలను నిండిన నీరెండ వెలుగులోన
మెరుగు ముత్యములై తాము మెరయుచుండె

పుడమి సొబగులనెల్ల పెంపొందజేయ
నలువ జల్లిన బంగరు నలుసులనగ
అచ్చటచ్చటనొక్కొక్కటలరుచుండె
కమ్రసౌందర్యమింపారు గడ్డి పూలు

పదములిడుదమీ పచ్చిక బయలునందు
కని తరింతుము తలలూచు గరిక పూల
పలుకరింతుము హిమబిందు బాలికలను
ఉదయమందెదము మనమీ యుదయమందు

నేల నలువైపులను దాటి నింగి దాటి
అంతరిక్షము దాటి శూన్యమును దాటి
అందదలచెడునట్టి యానందమెల్ల
కాంచగల్గిననిచ్చటే పొంచి యుండె

*****

# ఖాళీ ఉత్తరం

నిషిగంధ

నువ్వొదిలెళ్ళిన క్షణాలు...
సావకాశపు సాయంత్రపు నీడల నాటివి
కాసిని గుల్‌మొహర్ చెట్టు కిందా...
ఇంకాసిని మోటబావికెళ్ళే రోడ్డు పొడవునా
ఇప్పటికీ తారట్లాడుతూనే ఉంటాయి..
పాతబడవూ.. పరిమళం వదలవూనూ!

తడి వెంట్రుకల్లో చిక్కుకుపోయిన
గుసగుసలూ..
చెవి వెనుకే అంటుకుపోయిన
వేలికొసల కంపనలూ..
రహస్య బహుమతులెన్నెన్నో!

ఆకాశం మోయలేక
జారవిడచిన నల్లమబ్బొకటి
గుమ్మం బయట నర్తిస్తుంటే...
మారిన ఋతువుల రాగాలేవో
సరిచూసుకుంటూ
జ్ఞాపకాల జుగల్బందీ మొదలవుతుంది!

పదం పదం పొందికగా కూర్చి
అప్పటికప్పుడు నీకేదో రాద్దామనుకుంటాను..

మనసైన ఏకాంతాలన్నీ
కదిలీ.. మెదిలీ.. దిగ్గున చెదిరెళ్ళిపోయీ
వేసవి మధ్యాహ్నపు వీధిలాంటి
మనోఫలకాన్ని మిగుల్చుతాయి..
అనుకున్నదంతా చెప్పగలిగే
అక్షరాలన్నీ అదృశ్యమౌతాయి!

చివరి చుక్క వరకూ చేరుకోని అభావ వాక్యమొకటి
బెంగగా రాలిపడుతుంది!

అసలంటూ ఏవీ లేకుండా కాదులే...
కళ్ళ కొలకుల జారుతున్న బిందువుల సాంద్రతనైనా
కొలిచి పంపిస్తాను!!

***



# వెన్నెల సంతకం

క్రాంతికుమార్ మలినేని

నాలుగు దిక్కుల్లో ఏ దిక్కూ కాని చోట
అదే తనివి తీరని అందంతో
ఎప్పటిలాగే తను
తన ఇంటి వాకిట్లో

దిక్కులన్ని ఒక్కటైనవేళ
ఆరాధనతో
ఎప్పటి లాగే నేనూ సిద్ధం
మా ఇంటి మల్లె పందిరి నీడలో

అలా ఊగుతున్న మల్లెతీగల సాక్షిగా
ఎన్ని దోబూచులాటలో
కదిలిపోతున్న మేఘాల సాక్షిగా
ఎన్ని దాగుడు మూతలో

అలా ఎంతసేపో...

తను నన్ను చేరుతుందన్న ఎదురుచూపుల్లో
అలిసిపోయి సోలిపోతే
ఎంతసేపు వేచిచూసి విసుగేసిందో
నీహారికని చిలకరించి నన్ను లేపి

ఒక వెన్నెల సంతకం
వదిలి వెళ్ళిపోయింది

అలా తను చేసిన సంతకాలెన్నో
అస్తిత్వం చూపలేని
ఈ మనసులోతుల్లో

దాటేయలేనా యే?
ఎంత పొడుగున్న పగటినైనా
తన చిరునవ్వు జ్ఞాపకాల్లో

తనని పంపిస్తానన్న భరోసానిచ్చిన సాయం సంధ్యలో
తనను మళ్ళీ చూస్తున్నానన్న ఆనందంతో నా కళ్ళలో

మరో
వెన్నెల సంతకానికి
సిద్ధమవుతూ....

★★★



# నిజంగా..! వెంకట్

బయట మబ్బులతో నిండి ఉన్న ఆకాశం
చల్లాగా ఉండీ ఉండనట్లుగా వీస్తూ గాలి
సన్నగా కురుస్తూ వర్షం

లోపల ఇంకా మొదలవని వర్షం
మాటలెందుకనో మేఘం కింద మెరుపుల్లా
ఉండుండి గాని దొరకడంలేదు

సున్నాలాగా మౌనం దానికదే ఒక విలువ కాలేదు
ముందో వెనకో బేరీజు వేసుకుని చూసుకోదగ్గ
అంకెలూ అనుభవాలూ చేరితే గాని
చెప్పుకోవడానికి ఏ కాస్తంతయినా మిగలదు!

పెదవులు పాడలేక వదిలేసిన మాటల్లేని మోహగీతాన్ని
అలవోకగా ఆలాపిస్తున్నట్లు ఉండే చూపులు

కళ్ళలోకి చూసినప్పుడుల్లా
అప్పటికప్పుడే ఏదో ఆపుకోలేని మత్తులోకి
జారిపోవాలనిపించి
మాట్లాడలేకపోయినప్పుడల్లా
ఏమిటి ఈ మూగతనం? అన్న
మాటలతో అడగని ప్రశ్నను ఏ సూచనతో
సమాధానపరచడం?

గుండె బరువుగా నిండిపోయి వున్న
ఏదో చెప్పనలవికాని బాధలాంటి సుఖాన్నో
సుఖంలాంటి బాధనో
విడమరచి చూపించే యత్నంలో
సంకోచంగా వికసిస్తున్నట్లు వుండే
చిరునవ్వు వెనక వేదనను చూసి బెదరినప్పుడల్లా
ఏమిటి ఈ బేలతనం? అన్నట్లు ఉండే
అరమోడ్పు కన్నుల భారాన్ని ఏ వీవెనతో తేలికపరచడం?

మనసులోపలి మౌనాన్ని మాటలతో నింపడం
జ్ఞాపకాల్ని మోయడమంత తేలిక పని కాదు

నిజంగా!

★★★★



# మనసే రథసారథి

రాధిక బుక్కా

ఒకే రోజులో రెండు ఉదయాలను చూసాను

ఆకాశం లో విహరిస్తూ అలలపై తేలాను
కోనేటి తామరలను ముద్దాడి వచ్చాను
సిరిమల్లెల విరజాజుల నీడను కూర్చున్నాను
పెరట్లోని పచ్చికపై వజ్రాలను ఏరాను

చెట్టుపైన రాచిలకతో ఊసులు కలబోసాక
సాయం సంధ్యను నిదరోమ్మని మబ్బులతో కప్పాను
చల్లని చంద్రుడు పండు వెన్నెలను పంచుతుంటే
వజ్రాలను వెదజల్లి నక్షత్రాలుగా పేర్చాను





నిండు జాబిలితో గంపెడు ఊసులు చెప్పాను
మాటలలో మధురిమలు మల్లెలుగా మార్చాను
కొబ్బరాకు పైన చంద్ర కిరణమై జారేను
ముద్దమందారపు చెట్టు ముంగిట్లో వాలాను

అట్లాంటిక్ లో ఆణిముత్యాలను దొరకబుచ్చుకుని
పసిఫిక్ లో పగడాలతో కలిపి జప మాలను అల్లాను

కోరికలే గుర్రాలయితే మనసే రథ సారథి ....

****

# నిశ్శబ్దరాగం

డా.నీరజ అమరవాది

నువ్వు
నా మనసును అల్లుకున్న
జ్ఞాపకాల లతవి
ప్రకృతి వైపరీత్యాలు
చెదరనీయవు
విధాత మార్చలేడు

ఒకరి చేతి రేఖలు
మరొకరి రేఖలను
పోలి ఉండనట్లే
నా అనుభూతులు అచ్చంగా నావే
వాటిపై ఎవరికి
ఎటువంటి హక్కు లేదు

గడచిన కాలం తిరిగిరాదు
కాని అందమైన అనుభవంగా
స్థిరనివాసం ఏర్పరచుకొంది
అది మది మందిరంలో
అఖండ జ్యోతిగా మారి
నాలో సంతోష కాంతులను నింపుతోంది

నీ చిరునవ్వుల గుబాళింపులు
గుర్తుకురాగానే నా మానస సరోవరంలో
ఆనంద తరంగాలు,
వాటిని అందుకోనేలోగా
ఊసుల సయ్యాటలు,
ఒక దాని తరువాత మరొకటి

నువ్వు తోడు లేకున్నా
నేను ఉన్నంతవరకూ "మనమే"
నా మనసైన నిన్ను తలుస్తూ
నీదైన నా మనసులో
వసివాడని ఆనందాలు
నిశ్శబ్ద ప్రణయరాగాలు..!!

****

# నువ్వు – నేను

జ్యోత్స్న తీర్థాల

నా ఊపిరిలో నా ఉనికిలో నువ్వే ఉంటావు
నా ఆలోచనలో నా ఆవేశంలో నువ్వే వుంటావు
నీతో మొదలయ్యి నీతో అంతమయ్యే రోజులో
నీలో నేనుంటాను - 'నువ్వు నేను' ఇవి ఒట్టి స్వరాలే
నీతో నేను, నాతో నువ్వు ఇవి నా సర్వస్వాలు ****

# భావవీచికలు

వీరేశ్వరరావు.ఎమ్.

ప్రియురాలు
వెళ్ళిన దిగులు
ఆకురాలుకాలం మిగులు

★★★

చెట్టు తలలో
విహంగాల వాయులీనం
నేను కవిత్వంలో లీనం

★★★

నిర్మలంగా ప్రవహించే
నర్మద
నా ఎద

★★★

మోడు చివర చిగురు
ఆశే శ్వాసైన కబురు

★★★

సాగరతీరాన్న ఆమె
వదిలిన పాదముద్రలు
కెరటం తిరిగి కడలి ఎదలోకి!

★★★

చెట్టుని కోల్పోయిన పిట్ట
గుట్టుగా గదిలోకి వచ్చిన పాటల పుట్ట

★★★

# మన పద్యం మంచిముత్యం     ఎస్.వి.ఎస్.చారి

అక్షరమ్ములన్ని హంసలై నడయాడ
పదమయూర నాట్యప్రభలు వెలుగ
గణములన్ని ప్రమధ గణములై మ్రోగించు
హృద్యపద్య గాన హృదయ వీణ
తీయని భావనామృతము తేటతెనుంగు పదాంబుజంబులన్
హాయిని గొల్పుపద్య వచనాకృత కావ్యరసాన్వితమ్ములై
గేయ పరాగ రాగ మృదు కేళిని తేలుచు స్వాగతించగన్
గాయక పాఠకాళియును గానము సేయరె తన్మయాత్ములై

శిలలోని కఠినంబు పూల లాలిత్యంబు
హర్యక్ష దర్పంబు హరిణి శైలి
చిరుతల వేగంబు కుందేటి పరుగులున్
జలధి గంభీరతల్ జలద స్వనము
బాలభానుని కాంతి బాలచంద్రుని క్రాంతి
అనలుని జ్వలనంబు అనిలు శక్తి
అందాల హరివిల్లు ఆనంద విరిజల్లు
వేణుగాన లహరి విశ్వహితము

కవి తలతలంపు లన్నియు కలము జేరి
సజ్జన హితంబె లక్ష్యమై సృజన జేయ
కవిత కవితందు కనిపించు కావ్య శోభ
తెలుగు పూదోట కవితల వెలుగు బాట
నన్నయాది కవుల నాణ్యంపురచనలన్
రాటు దేలినట్టి మేటి కవిత
సహజ కవుల మధుర శబ్దాంగ సౌందర్య
సొగసు లద్దుకున్న సుందరాంగి

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

చక్కని యొక కుటీరమ్ము చాలు నాకు
పూల మొక్కలు చుట్టును పొలుపు గూర్చ
రంగవల్లులు ముంగిట రాజిలంగ
పసుపు కుంకాల గుమ్మముల్ మిసిమి దేర

పక్షుల కిలకిలలతోడ బయలు నిండ
ప్రేమ వాత్సల్యములిచట విడిది చేయ
నవ్వువెల్లువలిల్లెల్ల నాట్యమాడ
చక్కని యొక కుటీరమ్ము చాలు నాకు

దినము గడచిన వెనుక సంతృప్తితోడ
నా ప్రపంచపు త్రోవలో నడచు కొరకు
క్షణములన్నియు నీతోడ గడపు కొరకు
చక్కని యొక కుటీరమ్ము చాలు నాకు

కాలమును ప్రశాంతమ్ముగ గడపు కొరకు
కలకలము లేక మనసును కాచు కొరకు
నిశ్చలత్వము బ్రతుకున నింపు కొరకు
చక్కని యొక కుటీరమ్ము చాలు నాకు

ఆశలనహమ్ములనతిశయముల వీడి
వీడి యాడంబరములను భేషజముల
ప్రేమ చెలువారనిట గడపెదము మనము
చిన్నదౌ కుటీరమ్మున జీవితమును

*****

# కలల మొలకలు   నాదెళ్ల అనూరాధ

కలలు మొలకెత్తిన మొన్న లేవీ ?
వాటిని నెమరేసిన నిన్నలేవీ ?

మట్టి పెళ్లల వెచ్చని ఒడిలో  ఒదిగి చూసే కలల
కలవరింతల విత్తులేవీ ?
అస్తమయ సూర్యుడితో గుసగుస లాడుతున్నాయా ?

నాలుగు దిక్కులా చేతులు చాచి ,
భూమిని ,ఆకాశాన్ని,పులుముకున్న మాయనీ ,
పలకరించే గాలినీ ,ప్రవహించే మబ్బునీ ,
పరవశం గా చుట్టుకుని,  లోవెలుగుల జాడల్ని
వెతుక్కుంటున్నాయా ?

నిన్న నువ్వూ ఉన్నావ్ , నేనూ ఉన్నాను !
నిలువెల్లా కలలూ ఉన్నాయ్ !

వేళ కాని వేళ  విరిగి బ్రద్దలవకుండా ,
కనురెప్పల పహరాలున్నాయ్  !

అదాటున పొంగి పొరలిపోకుండా
నిరీక్షణ  దడి కట్టే హద్దులున్నాయ్ !

తూరుపు వాకిలి చిమ్మిన కిరణం
లేకొమ్మకు చిగురును పూసి ,
ప్రకృతి రంగుల వన్నెలు పొదిగి
పరిమళాల సాంత్వన అద్ది
నిన్ను పలకరించే వాస్తవమయితే .................

అదిగో మళ్లీ ......,
నా నిన్న లేవీ అంటున్నావా ?
వాటికి మరిన్ని హంగులు అద్దుతా నంటావా ?
ఇంకా వాటితో పని ఉందంటావా ?

నిన్నలు రేపులై పోతే  బావుణ్ణంటావా ?
మరి రేపటి కలలు  చిన్నబోవా ?

చిన్నబోయే రేపటి కలలకి ఏం  చెబుతావ్ ?

★★★★



# అదే నిద్ర, అవే కలలు

వెంకట్

వెళ్తూ వెళ్తూ చూపు చివర
నువ్వు వదిలేసి వెళ్ళే చిరునవ్వుని
తోడుంచుకుంటే
రాత్రి గడవడానికి మరి నాకిక ఏ విరహం వుండదు
అదే ఆహారమూ , అదే నిద్రా...

ఆపై కళ్ళను నిండిపోయే కలల్లో
ఒకటే మత్తెక్కిన మూగ పిలుపుల సువాసన
ఆగి ఆగి వీచే విడి పెదవుల పరిమళం
ఎందుకో అర్థంకాని తొందరలో
రాలి పడిన ఆకులపై మెత్తగా నలుగుతూ
జంట పాదాల పలవరింత
అప్పుడప్పుడే మొగ్గ తొడిగి అంతలోనే చిట్లి వికసిల్లి
విస్తుపోతూ మూర్చిల్లే కళ్ళ రెప్పల కేరింత
మరింక క్షణకాలమైనా ఆగలేక
మాటలలో మరింకేమీ చెప్పలేక
వేచి వేచి చప్పుడుచేసే
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాల వింత ప్రణామం
స్తబ్దుపడిన ప్రకృతి నడుమ
తాపంతో తామర కొలనై పరుచుకుంటూ నీ తనువు
తడవకుండానే ఆరబోయే తృష్ణను చల్లార్చుకుంటూ నా తనువు...

తలపుకు వస్తూ అవే కలలు
తలపుకు రాకుండా అదే నిద్ర!

★★★★

# మనసు రాత

క్రాంతికుమార్ మలినేని

మనసంటే మనకి విలువ లేనప్పుడు

గుండె నాలుగ్గదులూ ఎన్నిసార్లు వెతికినా
మనసులోతుల్లోకి ఎంత దూరమెళ్ళినా

ఒక్కటే

ఒయాసిస్సులేని ఎడారిలో నీరు దొరకనట్టు
అర్ధం చేసుకునే భాష మనసుకి రానప్పుడు

మాటల్ని ఎన్ని బాషల్లో చెప్పినా
ప్రతి మాటకీ ఎన్ని నానార్ధాలున్నా

ఒక్కటే

వర్షం కురిసి ఆకాశం తడిచినట్టు

****



# నా లేఖిని

శ్రీ స్వర్ణ

వేకువజామున మేలుకున్న క్షణం నుండి
నీ తలపులతో శరవేగంతో పరిగెడుతూ,
మదిలో సరసమైన స్వర్ణాక్షరాలనే లిఖిస్తుంది!

నీ తీపిఊసులు గుర్తొస్తే
మత్తెక్కించే పదాలతో
పొందికైన అక్షరాలు పరిచేస్తుంది
శ్వేతాంబరం లాంటి తెల్లకాగితంపై. !

నీవు నా చెవిలో గుసగుసలాడితే
సిగ్గులసింగారాన్ని ఒలకబోస్తూ
చెక్కిలిపై పగడపు అక్షరాలే వ్రాసేస్తుంది!

నీవు నాచెంత లేనినాడు
నాకలంలోని భావాలన్నీ
కలబోసుకొని
విరహకావ్యాలే రచిస్తుంది !

నీవు నన్ను అల్లుకున్న తరుణాన
నాట్యమయూరిలా నర్తిస్తూ
రాధామాధవుల ప్రణయబంధాన్నే రచిస్తుంది

నీతో వేసిన సప్తపది తలిచిన,
అడుగుకో పరిమళంతో
కళ్యాణకాంతులే వెదజల్లుతుంది. !

నేను నీ సొంతమైన రోజు
రతీమన్మధులకే అసూయ కలిగేలా
రసరమ్యంగా వర్ణిస్తుంది
మన ఏకాంతాన్ని!

****



# ఆశ నిరాశ

విజయకుమార్ ఎస్వీకె

వెనుకో ముందో
క్షణమో రోజో
ఒక వెలుతురు
నన్ను కమ్మేస్తుంది...

⋆ ⋆ ⋆

నువ్వో నేనో
యెవరో ఒకరం
ఒక ప్రశ్నకి
రెండు జవాబులిస్తాం
ప్రశ్నే తప్పయి
నివ్వెరపోతాం...

ఆకాశంవంక నేను
ఒక అదృష్టం కోసం
తపిస్తూ చూస్తాను
నా వెర్రిని
నా నిరీక్షణని
వెక్కిరిస్తూ
నన్ను నువ్ తన్నుకుపోతావ్...

రేపటిగూర్చి
ఆశ చిగురించని నిన్ను
ఇవ్వాల్టితో
అంతం అయ్యే నిన్ను
కానరాని కోనలకి విసిరేయాలన్న
కోపం...

ఐనా
నువ్ లేని
నేను లేను..

⋆ ⋆ ⋆

కానీ,
వెనుకో ముందో
నన్ను పూర్తిగా
కమ్మేస్తుంది ఒక వెలుతురు...

*****

# టైమ్స్ స్క్వేర్

యు.ఎ.ఎన్.మూర్తి

దిక్కులన్నీ మాకు దివిటీలు పట్టాయి
వీధులన్నీ వెలుగు వాకలుగ మారాయి
చుక్కలన్నీ వచ్చి పక్క కూర్చున్నాయి
ఇంద్రధనుసులు ఇళ్ళ ముంగిళ్ల వాలాయి
ఈ లోకమే కాంతిచక్రమై ఎగిరింది!
పచ్చలు పగడాలు వజ్రవైఢూర్యాలు
తోరణాలై మాకు దోయిలందించాయి
అతిలోక సుందరులు హారతులు పట్టారు
అలల కడలిగ అందమాటలాడింది
ఆటుపోటుల తోడ అడుగడుగు వేడుకలు
అంతుపొంతూ లేని అబ్బురము గొలిపాయి!
అశ్వ హేశాలు నింగి హద్దులను తాకాయి
పూలరథమై పుడమి పులకరించింది
వివశమంతా ఇచట విడిది చేసింది
వీరు వారను బేధమంతరించింది
కాల శృంగాటకము కరచాలనము చేసి
కలనాదములతోడ మిల మిలా మెరిసింది!
ఆపాదమస్తకము ఆహ్వానగీతమై
అపురూప గాంధర్వమవతరించింది
నింగికీ నేలకూ నిచ్చెనలనెత్తించి
న్యూయార్క్ నగరమే నవ్వుగా మారింది
అద్దరేతిరి కూడ ఆనందతీర్థమై
అలుపు సొలుపూ లేని హాయి సమకూడింది!!

****

# యవ్వనోద్ధతి – ఒక జవనాశ్వ హేల నాగరాజు రామస్వామి

రేయి కడకంటి కాటుక రేఖ మెరసి
కరిగి పారిన వేకువ దారి లోన
మొగ్గ విడిచిన ఎలలేత మోవి రువ్వె
కొసరు మిగిలిన నడిరాత్రి కొంటె నవ్వు

కలయొ, నిదురనో,మెలకువో, తెల్య రాని
మత్త లోకాల తూగాడు కొత్త జంట
దీపవల్లి ద్వయాద్వైత దీప దీప్తి !
ప్రణయ పరువ పరీరంభ పరిమళమ్ము !
మరులు ఇగురొత్తు మురిపాల విరుల వాన !

ఇది చిగురు వెన్నెలల ఈడు, ఎద మధువులు
పొంగు మధురోహలుప్పొంగు పూల వయసు!
గాలి వాలులో తేలాడు ఈల పాట !
ఉబుసు పోకల సరిఊట, ఊసులాట!

దివ్య జవనాశ్వ ఘోషమో, శివమొ ,లేక,
నాక ధుని మారెనో యవ్వనముగ, కాక,
ఈ దుడుకు ఈడు కెటులబ్బ ఇంత పొగరు,
ఇంత జవము, ఇంట రవము, ఇంత రయము,
ఇంత వలపు తుళ్ళింత , కవ్వింత ఇంత ,
ఇంత రమణీయ కొమరు జీవంత హెల!

ఉషసు క్రీగంటి వెలుగులు ఉద్గమించ
పొద్దు పొడుపుల తొలిముద్దు లద్దు కొనుచు
నవనవోన్మత్త యువ జవనాశ్వమెక్కి
భూరి వినువీధి సూరీడు స్వారి చేయు !
ధరణి పారాడు ప్రాయంపు పైర గాలి !

****

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

బ్రతుకు దారిలో సాగు నా పయనమందు
ఆపి పలుకరించినది నా యాత్మ నన్ను
చెంతనుండెడి యాత్మ నీ చెంత చేరి
ఈవు నేనేయటంచు నాకెరుక జేసె

నా శరీరమ్మునాత్మయు నా మనస్సు
ఒక పరిథిలోననే నిల్చి యుండునంచు
తలచు నను జూసి నీనుండి తెలియజేసె
వేరెవరు కాను నీ ప్రతిబింబమంచు

ఈ దినమ్మిక ముందునకేగవలదు
ఈ వెలుగు నను వీడరాదెన్నటికిని
భ్రమ యిదైనచో వలయునీ భ్రమయె నాకు
ఇచ్చటే కాలము ఘనీభవింపవలయు

పలుకరించెడునాత్మ రావలదు తిరిగి
కాలగమనమ్ముతో ప్రేమ కరుగవలదు
తిరిగి వెన్కకు మరలెడు ఝురులు వలదు
మరలిపోయెడు స్మృతుల సంపదలు వలదు

నేను సర్వమ్ము నీలోన నిలచియుంట
నీవు సర్వమ్ము నాలోన నిలచియుంట
ఎంత సత్యమటంచు ప్రశ్నింతురెవరొ
సత్యమవదేని నేనునసత్యమౌదు

*****

# బియ్యం గింజలు   డా.రావి రంగారావు

ఆయువు బియ్యం బస్తా భుజానేసుకుని
ఓ గింజ కూడా జారిపోగూడదని
కళ్ళు మూయకుండా కాలం అరణ్యం గుండా
జాగరూకతతో నడుస్తున్నాడు మనిషి...
బియ్యంగింజల కొండల్ని మోసుకుంటూ
మనుషులు నడుస్తున్న దారిని
వాసన పట్టి అడుగులతో కొలుచుకుంటూ
నరక పథాల్ని దాటిపోతున్నాయి చీమలు...
గుప్పెడు బియ్యం నేలమీద అనాథగా పడిపోతే
ప్రతి బియ్యపు గింజను ఆప్యాయంగా పలకరిస్తూ
పవిత్రప్రేమతో గుండెల్లోకి తీసుకుంటున్నాయి
ప్రపంచ దేహంలో తెల్ల రక్త కణాల్లాంటి పక్షులు,
బియ్యం గింజల మీద పేర్లు రాయకపోతే
అదే అవకాశమని ఆ గింజలు చుక్కలై
ఆకాశంలోకెళ్ళి కూర్చుంటున్నాయి తీరిగ్గా
దేవత లందర్నీ సవాలు చేస్తూ...

కడుపులో లేస్తున్న కాముకుణ్ణి చల్లార్చటానికి
బియ్యంగింజల అప్సరసల కౌగిలి కోసం
ఎవరో దాచుకున్న బస్తాలకు
కన్నాలు పెడుతున్నాయి దిగజారిన ఎలుకలు...
బియ్యం మూలాల మీద పరిశోధనలు చేస్తున్నవారు
ప్రపంచ మంతా తిరిగినట్లు కాగితాల మీద రాసుకొని
అమ్మా, నాన్నలే బియ్యం చెట్లని
పెద్ద పెద్ద సిద్ధాంత గ్రంథాలు సమర్పిస్తున్నారు...
బియ్యాన్ని బియ్యంగా సహజంగా
పక్షులు తినగలుగుతున్నాయి కాని
అలంకారాలకు ఆడంబరాలకు దాస్యం చేస్తున్న మనిషి
బియ్యాన్ని బియ్యంగా తినలేకపోతున్నాడు!

★★★★



# తరగని సరాగాల గని

ఎలనాగ

ఉక్కపోతలో మునిగి ఉక్కిరిబిక్కిరయ్యాక, గానసారభాన్ని మోసుకొచ్చే గాలుల కోసం సాగుతుంది నా అన్వేషణ. గోల నిండిన గుంపును వదిలి, వేరే దిశగా వెళ్తుంటాను హాయి కోసం. స్వరసాంగత్య సంగీత కరవాలధార ధాటికి విషాదాల విషసర్పాలు వేయి ముక్కలౌతాయి. దుఃఖతిమిరంలో చిక్కుకున్న హృదయం చిక్కని రాగం చిమ్మే పసిడికాంతుల్లో తడిసి, రసికతను పులుముకుంటుంది. ఎల్లలు లేని ఎడారిని కప్పుకున్న ప్రాణం చల్లని నాదమేఘచ్ఛాయల్లో సేద దీరుతుంది.

మధ్యమావతి(1)తో మనసు ముడివడ్డట్టనిపించి, జనసమ్మోహిని(2)తో జన్మాంతర బంధమున్నట్టు తెలుస్తుంది. హంసనాదా(3)నంద(4) తరంగాల మీద తేలిపోతూ అలుపును పోగొట్టుకుంటాను. కోమల్ రిషభ్ ఆసావరీ(5) స్వరాల విందు అనంతరం కొత్త శోభలు నా అంతరంగన్నావరిస్తాయి. కళావతి(6) ఒలికించే కళాగరిమతో సకలాక్రోశాలు పటాపంచలౌతాయి. ఇక ఆభోగి(7) లోని ఆ భోగం గురించి చెప్పనేల? అది నన్ను అక్కున చేర్చుకునే చక్కని జవరాలు.

స్వరపరాగ మేఘపరిమళం కమ్ముకున్నప్పటి ఆహ్లాదభాగ్యం ముందు అన్ని ఐశ్వర్యాలూ దిగదుడుపే.

(1,2,3,4,5,6,7: శాస్త్రీయ సంగీతంలోని రాగాల పేర్లు.)



# నేనే నువ్వు

పంజా

ఎండలో నీడలా..... వానలో గొడుగులా
ఎడారిలో సరస్సులా .... రోదసిలో ప్రాణవాయువులా
కదిలే కథలా .... కదిలించే పాటలా
నా కిష్ట మైన  నాలా ..... నేనిష్టపడే నీలా
సముద్రదాహం తీర్చే నదిలా .....దరి చేర్చే తెరచాపలా

నిశిలో శశిలా ...... శిశిరంలో మంచు బిందువులా
అలసటలో నిద్రలా.... నిద్రలో అందమైన కలలా
అలరించే అలలా ..... చలిలో కౌగిలిలా
విశాలగగనంలో రంగుల దృశ్యంలా .....మైమరపించే దృశ్యకావ్యంలా
నడిచే నవ్వులా ...... నవ్వే చిత్రపటంలా

నాలాంటి నా మనస్సులా ..... నా నీడ లాంటి నాలా
అలుపెరుగని రవిపై  నమ్మకంలా ..... నడిపించే రాముని నమ్మిన హనుమంతునిలా
ఈశ్వరుని నుదిట సింధూరంలా ....సింధూరపు జ్వాలల అగ్నిలా.......
అగ్నికే పరీక్ష పెట్టిన వైదేహిలా

నాతో నువ్వు ......     నాలో నువ్వు .......          నేనే నువ్వు.

******



# ఒక పాట

మోహన్ రావిపాటి

ఒక వెన్నెల రాత్రి

ఎదురుగా అనంత సముద్రం

ఇసుక తిన్నెలపై ఒంటరిగా నేను

భీకర సముద్ర ఘోష, నా ఎద ఘోషను అణచివేస్తూ

సరుగుడు చెట్లమీదుగా గాలి, నా రోదనను అధిగమిస్తూ

వెన్నెల బొట్లు బొట్లుగా కెరటాల మీద కురుస్తూ

నా కన్నీటిని కళ్లలోనే దాచేస్తూ

ఎక్కడనుండో లీలగా ఓ జాలరి పాట

భాష , సాహిత్యం ఏది అర్దం కావటం లేదు

కాని ఏదో బాధను భారంగా మోసుకొస్తూ

నా కాళ్ళు ఆ భారాన్ని మోస్తానని పాటవైపు

పరుగులెత్తుతున్నాయి

ఎంత దూరం వెళ్ళినా ఇంకా దూరంగానే ఉంది,

మబ్బులు వెన్నెలను కమ్మేశాయి

చీకటిలో దారీ తెన్ను తెలియలేదు

వెలుగు కోసం చూశాను

దూరంగా సుదూరంగా ఒక చిన్న దీపం

పరుగులెత్తాను దీపం వైపు

అప్పుడు తెలిసింది

అది దీపం కాదు అని

మండుతున్న చితి అని

చితినుండి ఒక మండే కట్టెతో

వెర్రి గా పాట వైపు పరుగులెత్తాను

ఇంకా పాటగాడు దొరకలేదు

పరిగెత్తి పరిగెత్తి అలసి పోయాను

అక్కడో నీటి చెలమ, దాహం వేసింది

ఒక్కసారి దాహం కోసం చెలమలోకి వంగాను

చెలమలో నా ప్రతిబింబం

అప్పుడు తెలిసింది పాట నాదేనని

బాధ నాదేనని, చితి మంట నా ప్రేమదని

★★★★



# బేదానా

ఎస్.హరగోపాల్

నన్ను మరిచిపోయి
రాత్రి నిద్దురపోతుంది
నా కలలు, కన్నీళ్ళు దానికేం పట్టదు
మత్తుగా పడుకుంటదో, మరిచిపోతదో
నిద్రాకాలంలోనే నన్ను వొదిలివుంటదో
నేను ఒక్కణ్ణే
నువ్వు ఎక్కడే!?
రాసిన రాతల్లో నీ కోసం
రాల్చిన కన్నీళ్ళభాషే
ఎందుకురా ఇలా, అర్థంకాదు నా దుఃఖం
నిట్టూర్పుల ముత్యాలదండల్ని ఎవరు ధరిస్తారు
నీ ఆనవాళ్ళ తీరాలన్ని కొట్టుకుపోయాయిరా
నేనుత్త అలలనురగనై కొట్టుకుపోతున్న కథనే!!
ఆకాశపు నీలిమ దారాలను నేసిన
చుక్కల అంచులో గాలినేతగాడు
కండెలో నా గుండె కొట్టుకుంటున్నదే
కడకొంగు పట్టిలో పదముంది సూడే
నువు పువ్వు నింపిన మధుపాత్రవు
నేను ఎగిరివాలిన రెక్కల విషాదాన్ని
పరాగాలు ఎగిరిపోయాయి
సరాగాలు మిగిలిపోయాయి
రా.. రారా !!
కన్నీళ్లు రావేలనో...
నీ కింత జాగేలనో...

★★★★★★

# అంతర్మథనం

పి.వాణి

వాడిన జీవితంలో దిగమింగిన బాధల్ని
గుప్పిట పట్టిన నిజాల్ని, చెప్పుకోలేని వ్యధని
అన్నింటినీ మరచి
బంధాల్ని, బాధల్ని విడిచి నాలో నేనుగా
నాకు నేనుగా ఉండాలని ఆశ!
మౌనాన్ని విడిచి
ఎరుపెక్కిన బుగ్గలపై జారిన కన్నీటి సాక్షిగా
తిరిగిన కాలంలో చెదిరిన జ్ఞాపకాలలో
ముళ్ళబాటలూ, అగాధాలూ, అగ్నిగుండాల మధ్య
రాటు తేలిన గుండె ఒక్కసారి స్పందించి
వెనక్కి వెళ్ళమంటుంది!
నేను నేనుగా మిగిలానా అని ప్రశ్నిస్తుంది
స్వచ్ఛమైన నేను ఉన్నానా అని!
పిచ్చిదాన్నో బంధాల వలలో చిక్కుముడినో
నాకే తెలీని నేను , నన్ను నన్నుగా చూసుకోవాలని ఆశ!
మనసు ముసుగు తొలగించి
సహజమైన స్త్రీత్వపు సున్నితత్వంలో
ఆంక్షలూ, ఆధిపత్యాలూ, కోపాలూ, తాపాలూ
బరువు బాధ్యతలు అన్నింటినీ వదిలి
నాకు నేనుగా, నేను నేనుగా మిగిలిపోవాలి!
కరిగిన వెన్నెలలూ, తరలిన వసంతాలూ,
కలతలనూ, కలవరాలనూ
నెరసిన వెంట్రుకల్లో నైరాశ్యాన్నీ కాదని
వీడిన వాడిన నాలోని ఆశని వెదకి వెదకి పట్టుకున్నా!
మనసుకోసం, మమత కోసం నేను పడే ఆరాటం
వెర్రితనమో, వేదాంతమో — నాకు మాత్రం నిజం,
నీకు అర్థం లేని, నాకు అర్థం కాని నిజం
మనసులో కొలువున్న స్తబ్ధ నిక్షేపాలూ
నిర్బంధ నమూనాలూ
మస్తిష్కాన్నీ, మనో వాంఛల్నీ
నిశ్శబ్దంగా బలికోరిన జీవితం!
ఆశల రెక్కలు తెగి కొన ఊపిరితో కొట్టుమిట్టాడే ప్రాణం!
ఒకే ఒక్కసారి నన్ను నేనుగా చూసుకోవాలనీ
నిష్కల్మషమైన నన్ను నేను వెతికి పట్టుకోవాలనీ
నిజమైన నేనుగా ఒరిగి పోవాలనీ ఆశ!!

★★★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎన్ని యుగములు నీకొరకెదురు చూచి
అరయజాలక నా యెద యలసిపోయె
మనసుతో పాటు స్పందించు మనసు కొరకు
తిరుగుచుంటిని దిశల శోధించుచుంటి

కానుపింపదు నీ మూర్తి కనుల యెదుట
కనుల కనబడినంతలో కరిగిపోవు
చేరి నిలబడునిచట నా చెంతనిపుడు
తనిసి యొకపరి పలికింప తరలిపోవు

ఏది కలయొ! మెలకువయొ! ఏది నిజమొ!
తెలిసికొనవలెనని నాకు తలపు లేదు
ఉనికి లేమియు వసియించు మనసులోనె
కలయు మెలకువ రెండును వలదు నాకు

చెలియ! మన మధ్య నెలకొన్న చెలిమి నిజము
చెలిమి కలయై మనల మరచినది నిజము
శాశ్వతము కాని సత్యమ్ము సఫలతేమి?
సత్యదూరమౌ నిష్ఫలస్వప్నమేల?

అలసిపోయిన నాదు దేహమును విడచి
నిదురలోనికి జారగానెదురు చూతు
స్పృహ యటన్నది వలదు నాకీ నిశీధి
స్పృహను మేల్కొల్పు స్వప్నమ్ములేవి వలదు

*****

# తెల్లని కాగితాలు

ప్రతాప్

నిన్న ఈ స్థలమంతా పైరు, పంట లేని బంజరు భూములు !
కుడి ఎడమలు తెలీక, రెపరెపలాడే దీపాల్లా,
ఎవరి సొంతమూ కాని, ఈ అభాగితలు..తెల్లని కాగితాలు!
బాధతో, ప్రేమతో, ఆవేశంతో, ఆలోచనతో,
గునపాలు దించి, బీడు పెగలించి,
అక్షరాల విత్తులను విసిరిపోతే,
తలపు తపనల తడి ఆరబోతలో,
విరచిత రాతలు విలసిత లతలై,
అంకురించిన పదజతులకు పరిమళ జావళీలై,
లలితమమతల సఖితకు విరగబూసిన,
తెలుగు పూవుల తేనెల లిఖితగా,
అంతరంగాల జాడగా, ఆలోచనలకు నీడగా,
పొందికైన పేరికగా, మనసుకు మనుగడకు అద్దంగా,
వేదాలకు వేదికలుగా, నిర్వేదానికి నివేదితలుగా,
పుటగా ఒదిగిన పదబంధాలను కీర్తనలుగా,
సంపుటిగా ఎదిగిన కావ్యాలను యశోకీర్తికలుగా,
ఒనగూర్చిన ఈ తెల్లనికాగితములు,
భావములు పండించిన భాగ్యప్రదాతలు!
సువర్ణ సురేఖల ఈ సుమ ప్రపూర్ణ అక్షరాలు భిక్షనొసగిన
అన్నపూర్ణ!
కవి ప్రసవించిన ఈ రవి కిరణాలు,
గీతమాలికల ముంగిలికి రంగవల్లికలు!
ప్రవహించి ప్రభవించిన నాటి సంప్రదాయాలకు
పసిడి అల్లికలు!
ఏ భరణమూ సరితూగని, సరస్వతీ చరణాలు!
పారాణిగా రాసుకున్న కవి రాజులకు, రతనాల ఆభరాణాలు!
పారాడి చదువుకున్న మారాజులకు, నిండు మనసుల
నీరాజనాలు! ఈ తెల్లని కాగితాలు..

★★★★★



# గమ్యం క్రాంతికుమార్ మలినేని

అలుపెరుగని మీటలునొక్కి
అరిగిపోయిన మాటలు -
అర్ధరాత్రిని మింగేసిన
ఆకలేసిన సాయంత్రాలు -
తేలని కేసుల్లా మిగిలిపోయిన
వాయిదాలేసిన ఆనందాలు -
కలత నిద్రలోకి తెల్లారిపోయే ఉదయాలు
ఎర్రబారిన కళ్ళతో ఉషోదయాలు -
అరువుకేమైనా  తెచ్చుకోగలవా
ఒక నిమిషం ఆనందం... -
ఆనవాలుపట్టి వెతుక్కోగలవా
నీదంటూ ఒక్క క్షణం... -
జీవితమంటే అర్ధం కోసం
జీవితాంతం వరకూ
వెదుకులాట కాదు
జీవితం. -
మరలలేని దారిలోకి
ప్రయాణం మారకముందే
ఎటువైపో తేల్చుకో
నీ గమ్యం.!!

★★★★★

# భావ వీచికలు

ఎస్.కె.వి.రమేష్

## మల్లెమొగ్గ

మనసు విచ్చిన ఆ మల్లెమొగ్గకు
ఓనమాలు నేర్పుదామని అనుకునేలోపే ఆ తల్లితీగ,
తా వలచిన తుంటరి తేటికి జాబు రాసి
అందరి మనసులను మెప్పించే
మేటి గదా ఈ మల్లెమొగ్గ.

★★★★★★★★

## అమృతపానం

జీవితకాలపు అమృతపానం చేయడమంటే
ఏమిటో తెలుసా నీకు?
మనసులు మరిగినప్పుడు జారే
కన్నీటి చుక్కలను గౌరవించడమే.

★★★★★★★★★★

## చిలిపితనం

విచ్చిన నా మనసుతో!
ముడుచుకునున్న తన మేనిపై
ఓ రాయి వేసిన నా చిలిపితనాన్ని,
అలల పెదవులతో ఆ గట్టు చెవిలో
గుసగుసమంటూ ఎలా చెబుతోందో విను
ఈ చెరువు.

★★★★★★★★★

## అందం

అందం చూసుకుందామని
అద్దమంటి ఆ ఆకు చివర రాలుతున్న
నీటిబొట్టు లోకి చూస్తూ
ఆ అద్దానికే ఎంత అందాన్ని అరువిచ్చిందో
చూడా కిరణం.

★★★★★★★★



# బడుగుజీవి వాణి చిలకలపూడి

ఉలిక్కి పడే నిశిరాత్రులు,
ఆకాశంలో మెరుపుల కాంతుల, తూటాల చప్పుడు
ఎగసిపడే కెరటాలు విరిగిన హోరు
ఎరుపెక్కిన నింగికి గురిపెట్టిన కళ్ళు
చీకటి బతుకుల్లో వెలుగు నింపాలనే తాపత్రయం
ఒకటో రెండో కాదు వేలవేల నక్షత్రాలు
చీకటి మెరుస్తూ ఉల్కలై రాలిపడినా,
పోరాటం ఆగిపోదు
అడవి బాటలో నడిచే ప్రతి అడుగూ
నీడల్లో కలసి పోయి, చీకటిలోనే మిగిలిపోతుంది
సామాన్యుడి పాలిట శాపంలా,
అధికారం, ధనం ఉన్నవాడికి మాత్రం
మాటల తూటాలు పేల్చే మనిషైనా
నేల తల్లిని నమ్ముకుని బ్రతికే వాడైనా
కాయాకష్టం చేసుకునే వాడైనా
కన్పిస్తేచాలు ఎంత ఆనందమో
ఎందుకో తెలుసా?

గట్టిగా అడిగితే విప్లవకారుడని వెలేయడానికి
ఒంగి ఒంగి దండాలు పెడితే కాళ్ళ క్రింద వేసి
తొక్కేయడానికి
దోచుకోవడానికి, దండుకోవడానికి
చేసిన తప్పుల్ని నెట్టేయడానికి
ఒక అమాయకుడు దిరికాడని ఆనందం
జనారణ్యంలో ముసుగులేసుకు తిరిగే పెద్ద మనుషులు
నవ్వుతుంటారు నిన్ను చూసి,
చేతులు చాపుతారు, సాయంచేయడానికి కాదు
అధోఃపాతాళానికి తోసేయడానికి
స్కాముల్లో కోట్లకు కోట్లు భోంచేస్తే అది 'కుంభ'కోణం
దానికి శిక్షలుండవు, విచారణలు తప్పితే
సెజ్‌ల పేరుతో భూముల్ని దానం చేస్తూ
అందినంత దోచేస్తూ, దొరికినంత భోంచేస్తూ
తూటాలకు బలిచేస్తూ
కష్టజీవిని ఉగ్రవాదిగా చిత్రిస్తూ ఉండే నాయకులకు
శిక్షలుండవు, జే జేలు తప్పితే
నడిరోడ్డుపై సరికేసినా, పదిమందిలో యాసిడ్ పోసినా
శిక్షలుండవు, ఎంక్వైరీలు తప్పితే !! ★★★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

తనదు కోపమే శత్రువు తనకటంచు
చేరి చెవినిల్లు కట్టుకు చెప్పినారు
ఆప్తులెందరో నాదు శ్రేయస్సు కోరి
ఐననేలనో రగులు కోపానలమ్ము

ఏమి యైనది మనసునకీ దినమ్ము?
ఏ ఘటన కోపశిఖను వెల్గింప జేసె?
ఏ ఘటన శాంతమును మరపింప జేసె?
శాంతమసహనములనేది సవ్యమిపుడు?

మన్నికైనది శాంతమే యెన్నడైన
సహనమును వీడ యోచన సన్నగిల్లు
తలపు తడబడ నెడదయు దారి తప్పు
ఎడద శ్రుతి తప్ప ప్రేమయునింకిపోవు

ఎవరో క్రోధకీలల ముట్టడించినపుడు
క్షమయు శాంతమ్ము వారింప జాలనపుడు
అమితసహనమ్ము నిష్ఫలమైన యపుడు
శత్రువైనట్టి కోపమే మిత్రుడగునో!

కమ్మ వాసనిచ్చు గంధపు వృక్షము
గొంతు కోయునట్టి గొడ్డలికిని
అవని లోన పెరుగు నవినీతి యీలాగు
సమ్మతమ్మొకపుడు క్షమకు హద్దు

*****